అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కరువు

- రూ.42కే చింతపండు సేకరణ
- చీపుర్లకూ అత్తెసరు ధర
- స్థానిక దళారులతో ఫారెస్ట్ అధికారుల కుమ్మక్కు

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 247 | విజయవాడ, గురువారం 10 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 10 April 2025 | Rs



సాయి సుదర్శన్ అదరహో...

- రాజస్థాన్‌పై గుజరాత్ గెలుపు

8

ఏఐతో పన్నుల వసూళ్లు

- అభివృద్ధి, సంక్షేమాలకు సరిపడేలా సొంత ఆదాయం
- సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆదాయాన్ని పెంచుకునేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సహాయం తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఆదాయ వనరులశాఖ అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇదే తొలి ఆర్థిక సమావేశం కావడం విశేషం. ఆర్థిక, వాణిజ్య పన్నులు, అబ్కారీ, అటవీ, గనులు, రిజిస్ట్రేషన్లు వంటి శాఖలపై సమీక్షించారు. ప్రధానంగా పన్ను ఎగవేతదారులను గుర్తించేందుకు ఎఐ సహకారం తీసుకోవాలని సూచించారు. అనేక రంగాల్లో పన్నుల ఎగవేత కనిపిస్తోందని, దీనిపై దృష్టి సారించాలని నిర్దేశించారు. సాంకేతిక కారణంగా పన్నుల చెల్లింపులు, అనుమతులు కూడా సులభతరం అవుతాయన్న విషయాన్ని వ్యాపారులకు కూడా వివరించి చెప్పాలని సూచించారు. అలాగే జిఎస్‌టి పోర్టల్, రాష్ట్ర డేటా సెంటర్, వాణిజ్య పన్నులశాఖ వంటి ఆదాయ వనరులతో సంబంధం ఉన్న శాఖల సమాచారాన్ని ఎఐతో అనుసంధానం చేయాలన్నారు. పన్నుల చెల్లింపుదారులకు నోటీసులు ఇవ్వడానికి, వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎఐని ఉపయోగించుకోవడం వల్ల పాలనలో వేగం పెంచవచ్చునని స్పష్టం చేశారు.



ఆదాయంపై ప్రత్యేక దృష్టి

కొత్త ఆర్థిక సంవత్సరంలో సొంత ఆదాయం లక్ష్యం రూ.1,37,412 కోట్లను 100 శాతం సాధించేందుకు అన్ని శాఖలూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎంత లక్ష్యం, ఎంత ఆదాయం వచ్చిందన్న దానిపైనా అధికారులను అడిగి తెసుకున్నారు. 2023-24 కన్నా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2.2 శాతం సొంత ఆదాయం పెరిగిందని అధికారులు వివరించారు. అయితే పన్నేతర ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో పెరగలేదని వారు పేర్కొన్నారు. జిఎస్‌టిలో 4.9 శాతం, వృత్తి పన్నులో 15.2 శాతం, మద్యంలో 24.3 శాతం వృద్ధి నమోదైనట్లు అధికారులు చంద్రబాబుకు వివరించారు.

కొత్త మద్యం విధానంతో భారీగా..

కొత్తగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీ ద్వారా ఆదాయం భారీగా పెరిగినట్లు ఆ శాఖ అధికారులు వివరించారు. 2024 అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 33 శాతం వృద్ధితో రూ.4,330 కోట్లు ఆదాయంగా సమకూరినట్లు పేర్కొన్నారు. ఇతర పన్నులకు సంబంధించి రూ.2,500 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, వాటిపైనా దృష్టి సారించాలని చంద్రబాబు ఆదేశించారు. వీటిల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఆస్తులపై, ఖాళీ స్థలాలపై పన్నులే ఎక్కువగా బకాయిలు ఉన్నాయని వివరించారు. ఆస్తి పన్నుపై ప్రకటించిన 50 శాతం వడ్డీ రాయితీ వల్ల కేవలం ఆరు రోజుల్లోనే రూ.240 కోట్లు వసూలయ్యాయని వివరించారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కావాల్సిన నిధులను సమకూర్చుకోవాలని సిఎం చంద్రబాబు సూచించారు. దీనికోసం సొంత ఆదాయాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించడంతోపాటు, ఆదాయం ఎక్కడ తక్కువగా నమోదవుతోందో అధ్యయనం చేసి, అందుకు కారణాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను తగ్గించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణాల్లో పెంచిన ఆస్తి (ఇంటి) పన్నును తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26కు సంబంధించి పట్టణాల్లో ఆస్తిపన్ను గత సంవత్సరంతో పోలిస్తే 15 శాతం, 2020-21తో పోల్చితే 30 శాతం పన్ను పెంచుతూ గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఫలితంగా రూ.320 కోట్ల భారం ప్రజలపై పడుతుందన్నారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులు పెంచబోమని మేనిఫెస్టోలో పెట్టారని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగి విలువ ఆధారిత పన్ను విధానాన్ని ప్రవేశపెట్టి చట్టసవరణ చేసి జిఓ నెంబరు 198ని విడుదల చేసిందన్నారు. గత వైసిపి ప్రభుత్వ బాటలోనే కూటమి ప్రభుత్వం నడుస్తూ ఇంటి పన్నులు పెంచిందన్నారు. గత ఐదేళ్లలో సుమారు 100 శాతం పన్ను పెరిగిందని, ఇది ఇంటి యజమానుల మీదే కాకుండా అద్దెదారులపైనా పరోక్ష ప్రభావం పడుతుందని శ్రీనివాసరావు తెలిపారు. పౌర సౌకర్యాలపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు పన్నుల పెంపుపై దృష్టిపెట్టడం తగదన్నారు. హామీనిచ్చిన విధంగా విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని రద్దు చేయాలని, పెంచిన ఇంటి పన్నును ఉపసంహరించాలన్నారు. పెంచిన పన్నుకు వ్యతిరేకంగా పట్టణ ప్రజలు సంఘటితంగా ప్రతిఘటించాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది.

నిరుపేదల గుర్తింపులో తిరకాసు

- పి-4 సర్వేలో లోపించిన పారదర్శకత
- బియ్యం కార్డులే ప్రామాణికం
- వలస కార్మికులకు జాబితాల్లో దక్కని చోటు



గుంటూరులో పేదల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్న సచివాలయాల సిబ్బంది (ఫైల్)

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పి-4 సర్వేలో పారదర్శకత లోపించింది. పేదల గుర్తింపునకు బియ్యం కార్డునే ప్రామాణికంగా తీసుకుంది. దీంతో, బియ్యం కార్డులేని వారికి, వలస కార్మికులకు, ఎటువంటి చేయూత లేదని వారికి జాబితాలో చోటు దక్కలేదు. రాష్ట్రంలో 20 నెలలుగా బియ్యం కార్డుల జారీ నిల్చిపోవడంతో పేదలైనప్పటికీ పి-4 సర్వేకు దూరమయ్యారు. .రేషన్ కార్డు ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి పింఛను పొందుతున్న వారిని, విద్యుత్ రాయితీ పొందుతున్న ఎస్‌సి, ఎస్‌టిలను ఈ సర్వేలో మినహాయించారు. నిరుపేద కుటుంబాలను గుర్తించి జిల్లాల నుంచి అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ కుటుంబాల వారిని బంగారు కుటుంబాలుగా ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో 1.40 కోట్ల కుటుంబాలకు బియ్యం కార్డులు ఉన్నాయి. వీటిలో 20 శాతం కుటుంబాలను నిరుపేదలుగా గుర్తించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీనికనుగుణంగా 29 లక్షల కుటుంబాలను గుర్తిం చినట్టు అధికార వర్గాలు తెలిపాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఎప్పటికప్పుడు తారుమారు అవుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ రంగంలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు గరిష్టంగా రూ.15 వేలు వస్తుండడంతో గత ప్రభుత్వం వీరికి బియ్యం కార్డులు తొలగించింది. 60 ఏళ్లు నిండాక వీరు ఉద్యోగం కోల్పోతున్నా వారికి తిరిగి బియ్యం కార్డులు ఇవ్వడం లేదు. గత 20 నెలలుగా బియ్యం కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపో యింది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో వైసిపి ప్రభుత్వం 2021లో నవశకం సర్వే పేరుతో ఆరెంచెల విధానాన్ని అమలు చేసి 7.5 లక్షల కార్డులను రద్దు చేసింది. ఆ తరువాత దశల వారీగా కొన్నింటిని పునరుద్ధరించినా దాదాపు ఐదు లక్షల కుటుంబాల వారు తెల్ల రేషన్ కార్డుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఈ కుటుంబాలన్నీ పి-4 సర్వేకు వెలుపలే ఉన్నాయి. బియ్యం కార్డులు ఉన్న వారిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియో గాన్ని ప్రమాణికంగా తీసుకుని నిరుపేదలుగా పరిగణించి సంబంధిత జాబితాలను గ్రామ, వార్డు సచివాలయా లకు అధికారులు పంపినట్టు తెలుస్తోంది. ప్రభుత్వమే పేదరికంలో ఉన్న వారి జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు పంపగా, సచివాలయాల ఉద్యోగులు వీరి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ లేదా ఒటిపి ద్వారా వారు స్థానికంగా ఉంటున్నట్టు గుర్తించారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఎటువంటి వసతి, సరైన జీవనం లేనివారిని గుర్తించినట్టు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. విద్యుత్ వినియోగం 200 యూనిట్లలోపు ఉన్న వారిలో వారి కుటుంబంలో ఎవరికీ గణించదగ్గ ఆదాయం, ఆధార్ లింకుతో పరిశీలిస్తే ఎక్కడా ఎటువంటి ఆదాయం ఉన్నట్టు కన్పించని వారిని అధికారులే గుర్తించి సచివాల యాలకు పంపినట్టు తెలుస్తోంది. కానీ, వీరి కన్నా అతి నిరుపేదలుగా ఉన్న వారు, కుటుంబాల్లో ఒంటరిగా ఉన్న వారు, పింఛన్లు లేని రిటైర్డు కార్మికులు, ఉద్యోగులు పి-4 సర్వేలోకి రాలేదు. వలస కార్మికులను అసలు పట్టించుకోలేదు. సచివాలయాల పరిధిలో మ్యాపింగ్ జరిగిన వారిని మాత్రమే గుర్తించారు. బీహార్, బెంగాల్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వలస కార్మికులు భవన నిర్మాణ రంగంలో కీలక భూమిక పోషిస్తుంటారు. వీరికి రేషన్ కార్డులు లేకపోవడంతో వీరిని గుర్తించడం లేదు. ఇతర జిల్లాల నుంచి వస్తున్న వలస కార్మికులున్నారు. వీరిలో కొందరికి పి-4 జాబితాలో చోటు దక్కలేదు. పట్టణాల్లో ట్యాప్ కనెక్షన్లు, పక్కా నివాసం ఉన్న వారిని పేదలుగా పరిగణించ లేదు. నెలవారీ విద్యుత్ వినియోగం, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగంతోపాటు ఆదాయ పన్ను, జిఎస్‌టి రిటర్నులు, సొంత ఆస్తి, ఇల్లు, నాలుగు చక్రాల వాహనం, ఆదాయ మార్గాలు అద్దె, వడ్డీ, పింఛన్లు పొందుతున్న వివరాలను ముందే తెలుసుకున్న ఇందుకు సంబంధించిన వారి డేటాను పరిగణలోకి తీసుకోలేదు. నిరుపేదలు, అభాగ్యులు, ఎటువంటి చేయూతలేకుండా అన్న క్యాంటీన్లకు వస్తున్న అనేకమందిని కూడా ఈ జాబితాల్లోకి చోటు దక్కలేదు.

వడ్డీ రేట్లు తగ్గింపు

- జిడిపిపై టారిఫ్ దెబ్బ : ఆర్‌బిఐ

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా రెండో సారి వడ్డీ రేట్లను తగ్గించింది. రెపో రేటులో 0.25 శాతం కోత పెట్టాలని నిర్ణయించామని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దీంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గనుంది. ఇంతక్రితం ఫిబ్రవరిలో వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్‌బిఐ తాజా నిర్ణయంలో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయి. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపించనున్నాయని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. భారత జిడిపిపై సుంకాల ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత వాణిజ్య యుద్ధ భయాలు, ముఖ్యంగా అమెరికా నుంచి సుంకాల పెంపు కారణంగా ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించవచ్చన్నారు. అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గొచ్చన్నారు. ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ మారక నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని.. ఇవి రాబోయే 11 నెలల దిగుమతులకు సరిపోతాయన్నారు.

వ్యర్థాల నిర్వహణలో కేరళ ఆదర్శం

- సిఎం పినరయి విజయన్
- వృత్తి-2025 కాన్‌క్లేవ్ ప్రారంభం



'వృత్తి-2025' నేషనల్ క్లీన్ కేరళ కాన్‌క్లేవ్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సిఎం పినరయి విజయన్

తిరువనంతపురం నుంచి ఎం.శివాజీ

వ్యర్థాల నిర్వహణలో కేరళను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. తిరువనంతపురంలోని కనకకున్ను ప్యాలెస్‌లో జరిగిన 'వృత్తి-2025' నేషనల్ క్లీన్ కేరళ కాన్‌క్లేవ్‌ను ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ పట్ల ప్రజలకు ఉన్న ఆందోళనలను పరిష్కరించేందుకు ఈ సదస్సు ఒక వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో కేరళ గణనీయమైన విజయాలు సాధించిందని చెప్పారు. సమిష్టి ప్రయత్నాలు అద్భుతమైన పురోగతిని సాధించాయని, స్థానిక స్వపరిపాలన సంస్థలు చాలా వరకు వ్యర్థ రహితంగా ప్రకటించ˘బడ్డాయని ఆయన నొక్కి చెప్పారు. మార్చి 2025 నుండి తాజా గణాంకాల ప్రకారం, క్లీన్ కేరళ కంపెనీ ద్వారా 61,664 టన్నులకు పైగా వ్యర్థాలను సేకరించి ప్రాసెస్ చేయబడ్డాయని తెలిపారు. ఇంకా 8.9 మిలియన్లకు పైగా గృహాల్లో ఉన్న వ్యర్థాల నిర్వహణ కార్యకలాపాలను డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలోకి మారాయని వివరించారు. ఇది దేశంలో ఒక మార్గదర్శక చర్య అని చెప్పారు. ఈ పురోగతులు ఉన్నప్పటికీ, వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల సామర్థ్యం, పనితీరుపై సందేహాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వృత్తి 2025 సమావేశం ప్రజలు, ప్రజా ప్రతినిధుల ఆందోళనలను పరిష్కరించడానికి కూడా ఒక వేదిక అని వెల్లడించారు. ప్రజా-కేంద్రీకృత కార్యక్రమాల ద్వారా ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో కేరళ పలు విజయాలు సాధించిందని చెప్పారు. వ్యర్థాల నిర్వహణలోనూ ఇలాంటి నమూనా విజయాలను పునరావృతం చేసి కేరళను దేశంలోని మిగిలిన ప్రాంతాలకు ఆదర్శంగా నిలపవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సు ఆ దిశగా మొదటి అడుగు అవుతుందన్నారు. స్థానిక స్వపరిపాలన, ఎక్సైజ్, శాసనసభ వ్యవహారాల మంత్రి ఎంబి రాజేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 'వ్యర్థ రహిత నవ కేరళ' ప్రచారం కింద కార్యక లాపాలను వివరించే సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి విడుదల చేయగా, నవ కేరళ కార్యాచరణ ప్రణాళిక సమన్వయకర్త టిఎన్ సీమా నివేదికను స్వీకరించారు. మంత్రులు కె రాజన్, ఎకె ససీంద్రన్, జిఆర్ అనిల్, పిఎ మహ్మద్ రియాస్ ఈ సదస్సులో పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఎమ్మెల్యేలు వికె ప్రశాంత్, కడకంపల్లి సురేంద్రన్, ఆంటోని రాజు, కె అన్సాలన్, సికె హరీంద్రన్, వి జాయ్, డికె మురళి, వి శశి, ఐబి సతీష్, జి స్టీఫెన్, ఎం విన్సెంట్‌తోపాటు తిరువనంతపురం మేయర్ ఆర్య రాజేంద్రన్, జిల్లా పంచాయతీ అధ్యక్షులు అడ్వ పాల్గొన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శారద మురళీధరన్ ప్రారంభ ఉపన్యాసం చేశారు.

దీటుగా స్పందించిన చైనా

- అమెరికాపై టారిఫ్‌లు 84శాతానికి పెంపు
- పొరుగు దేశాలతో సంబంధాలకు గట్టి పునాది : జిన్‌పింగ్

బీజింగ్ : అమెరికా టారిఫ్‌లపై చైనా దీటుగా స్పందిస్తోంది. అమెరికా నుండి వచ్చే దిగుమతులపై టారిఫ్‌లను 84శాతానికి పెంచింది. గత వారం అమెరికా దిగుమతులపై 34శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించిన చైనా బుధవారం అదనపు ప్రతీకార చర్యల్లో భాగంగా ఆ టారిఫ్‌లను 84శాతానికి పెంచింది. బుధవారం అర్ధరాత్రి 12.01 గంటల (గురువారం) నుండి అమల్లోకి వస్తాయని కస్టమ్స్ టారిఫ్ కమిషన్ ప్రకటించింది.

అమెరికాకు చైనా చేసే ఎగుమతులపై ట్రంప్ ప్రకటించిన 104శాతం టారిఫ్‌లు బుధవారం నుండి అమల్లోకి వచ్చాయి. వైట్‌హౌస్‌తో టారిఫ్‌ల విషయమై చర్చలు జరుపుతారా లేదా అని ప్రశ్నించగా చెప్పడానికి చైనా ప్రభుత్వం తిరస్కరించింది. అమెరికా మరింతగా తన ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను పెంచడానికే సిద్ధపడినట్లైతే అవసరమైన ప్రతీకార చర్యలు తీసుకోవడానికి చైనా ధృఢ నిశ్చయంతో వుందని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన శ్వేత పత్రం పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వ మొదటి హయాంలో జరిగిన వాణిజ్య ఒప్పందంలో చేసిన హామీలను అమెరికా గౌరవించడం లేదని శ్వేతపత్రం పేర్కొంది. కాగా, టారిఫ్‌ల విషయంలో బేరసారాలు జరిపే అంశంపై చైనా ఇప్పటివరకు ఆసక్తిగా లేదని విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ బుధవారం వ్యాఖ్యానించారు.



పొరుగుదేశాలను అంతర్జాతీయ దృక్పథంతో చూడాలి

పొరుగు దేశాలతో ఉమ్మడి భవిష్యత్తుతో కూడిన సమాజాన్ని నిర్మించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ బుధవారం పిలుపునిచ్చారు. పొరుగు దేశాలతో చైనా కార్యకలాపాలకు కొత్త పునాదిని వేయడానికి కృషి చేయాలన్నారు. పొరుగుదేశాలతో సంబంధాలపై మంగళ, బుధవారాల్లో బీజింగ్‌లో నిర్వహిస్తున్న సదస్సులో జిన్‌పింగ్ పై వ్యాఖ్యలు చేశారు. నూతన శకంలో పొరుగు దేశాలతో మిగతా 7లో

కేంద్ర మంత్రి మనవరాలి హత్య

నాటు తుపాకీతో కాల్చిచంపిన భర్త

గయ : కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ మనవరాలు సుష్మా దేవి దారుణ హత్యకు గురయ్యారు. ఆమె భర్తే నాటు తుపాకీతో కాల్చిచంపాడు. బీహార్‌లోని గయా జిల్లాలోని తెతౌ గ్రామంలో బుధవారం పిల్లలు, సోదరి పూనమ్ కుమారితో ఇంట్లో ఉన్న సమయంలో సుష్మాదేవి హత్య జరిగింది.

పూనమ్ కుమారి పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం పని మీద పాట్నా వెళ్లిన సుష్మా దేవి భర్త రమేష్ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి తిరిగివచ్చాడు. తరువాత భార్యభర్తల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో రమేష్ నాటు తుపాకీ తీసుకుని సుష్మా దేవిపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ శబ్దం విని వేరే గదిలో ఉన్న పూనమ్, పిల్లలు అక్కడకు వచ్చారు. అయితే తీవ్ర గాయలతో రక్తపు మడుగులో సుష్మా పడి ఉంది. ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. అయితే కాల్పులు జరిపిన తరువాత రమేష్ భర్త అక్కడ నుంచి పారిపోయాడు. మృతురాలు సుష్మ వికాస్ మిత్రాగా పనిచేస్తున్నారు. బీహార్ మహాదళిత్ వికాస్ మిషన్ కింద అభివృద్ధి కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి, సమాజానికి మధ్య వారధిగా పనిచేయడం వికాస్ మిత్రాల విధి. రమేష్ పాట్నాలో ఒక ట్రక్కు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరికి 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరవీ వేర్వేరు కులాలు. రమేష్‌ను పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు గయ సీనియర్ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ (ఎస్‌ఎస్‌పి) ఆనంద్ కుమార్ తెలిపారు.



సుష్మా దేవి(ఫైల్)

కాగా, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ ఇప్పటి వరకూ ఈ ఘటనపై స్పందించలేదు. గయ లోక్‌సభ స్థానం నుంచి జితన్ రామ్ మాంఝీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మోడీ మంత్రి వర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్యతర పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అడవిని కార్పొరేట్లకు కట్టబెట్టొద్దు

- రంపచోడవరంలో టూరిజంపై వర్క్‌షాప్‌లో నినదించిన ఆదివాసీ సంఘాలు
- మైనింగ్, టూరిజం, పరిశ్రమలకి ఇవ్వాలన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

2

లోకో పైలట్లకు విరామం కుదరదు

- భోజనం, కాలకృత్యాలకు బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదు
- తేల్చి చెప్పిన రైల్వే బోర్డు
- మండిపడుతున్న ఉద్యోగ సంఘాలు

7

ఇక రాఫెల్ మెరైన్ జెట్‌లు

- భద్రతా వ్యవహారాలపై కేబినెట్ కమిటీ ఆమోదముద్ర



న్యూఢిల్లీ : భారత నావికాదళం కోసం 700కోట్ల డాలర్ల (సుమారు రూ.62 వేల కోట్లు) విలువ చేసే 26 రాఫెల్ మెరైన్ జెట్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు ఫ్రాన్స్‌తో ఒప్పందానికి భారత్ ఆమోద ముద్ర వేసింది. బుధవారం సమావేశమైన భద్రతా వ్యవహారాలపై కేబినెట్ కమిటీ (సిసిఎస్) ఈ మేరకు నిర్ణయం తీసుకుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందం కింద 26 రాఫెల్ విమానాలు భారత్‌కు అందుతాయి. వీటిలో 22 సింగిల్ సీటర్ జెట్‌లు కూడా వున్నాయి. విమాన వాహక నౌకల నుండి వీటిని నిర్వహించవచ్చు, మరో నాలుగు ట్విన్ సీటర్ జెట్‌లు వుంటాయి. రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన ఈ ఒప్పందానికి సిసిఎస్ ఆమోద ముద్రే తుది చర్య. ఈ నెలాఖరులో ఫ్రాన్స్ రక్షణ మంత్రి భారత్‌లో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా లాంఛనంగా ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని భావిస్తున్నారు. ఫ్రాన్స్ నుండే కొనుగోలు చేయాలని భావిస్తున్న మరో మూడు స్కార్పియన్ సాంప్రదాయ జలాంతర్గాములకు కూడా సిసిఎస్ ఆమోదం ఇంకా అందాల్సి వుంది. కాగా ఒప్పందంపై సంతకాలు అనంతరం రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలను నాలుగేళ్ళలో ఫ్రాన్స్, భారత్‌కు అందచేయాల్సి వుంటుంది. 2016 సెప్టెంబరు రూ.60వేల కోట్లతో కుదిరిన ఒప్పందంలో భాగంగా భారత వైమానిక దళానికి 36 రాఫెల్ జెట్‌లు అందాయి. 2019 ఎన్నికల్లో తీవ్ర చర్చనీయాంశమైన భారీ అవినీతితో కూడుకున్న రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం కొనసాగింపుగా ఈ కొనుగోళ్లు జరుగుతుండడం గమనార్హం.

జిరక్‌పూర్ బైపాస్ రోడ్ ప్రాజెక్టుకు ఆమోదం

పంజాబ్, హర్యానాలోని 19.2కిలోమీటర్ల జిరక్‌పూర్ బైపాస్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ.1878.31కోట్లు ఖర్చవుతుందని భావిస్తున్నారు. ఆరు లైన్లలో నిర్మించే ఈ రోడ్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం పాటియాలా, ఢిల్లీ, మొహాలీల నుండి వచ్చే ట్రాఫిక్‌ను మళ్ళించడం ద్వారా జిరక్‌పూర్, పంచకుల చుట్టుపక్కల ప్రాంతాల్లో రద్దీని తగ్గించడమేనని అధికార వర్గాలు తెలిపాయి. హిమాచల్ ప్రదేశ్‌కు నేరుగా రాకపోకలు కూడా ఏర్పడతాయి. ప్రతిపాదిత ప్రాజెక్టు తో 7, 5, 152 నెంబర్ల జాతీయ రహదారులపై ట్రాఫిక్ ఆంక్షలు లేకుండా, ప్రయాణ కాలం కూడా తగ్గుతుందని భావిస్తున్నారు.

ఇరిగేషన్ నెట్‌వర్క్ ఆధునీకరణ

ప్రధాన మంత్రి క్రిషి సించాయి యోజన (పిఎంకెఎస్‌వై) ఉప పథకంగా 2025-26 కాలానికి రూ.1600 కోట్ల తొలి కేటాయింపులతో ఇరిగేషన్ నెట్‌వర్క్ ఆధునీకరణను చేపట్టనున్నారు. నిర్దేశిత క్లస్టర్‌లో ప్రస్తుతమున్న కాలవల నుండి లేదా ఇతర వనరుల నుండి సాగునీటి సరఫరా కోసం నెట్‌వర్క్‌ను ఆధునీకరించడమే ఈ పథకం లక్ష్యంగా వుంది. దీనికి కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.

అడవిని కార్పొరేట్లకు కట్టబెట్టొద్దు

రంపచోడవరంలో టూరిజంపై వర్క్‌షాప్‌లో నినదించిన ఆదివాసీ సంఘాలు

మైనింగ్, టూరిజం, పరిశ్రమలకి ఇవ్వాలన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న శిరీషాదేవి, వేదికపై పిఒ కట్టా సింహాచలం, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్

ప్రజాశక్తి - రంపచోడవరం (అల్లూరి జిల్లా)

గిరిజన చట్టాలను తుంగలో తొక్కి మైనింగ్, టూరిజం అభివృద్ధి తగదని, కార్పొరేట్లకు, ప్రయివేటుకు అడవిని కట్టబెట్టవద్దని పలు ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. గిరిజన చట్టాల్లో మార్పులను సహించబోమని స్పష్టం చేశాయి. టూరిజం అభివృద్ధి, మినీ పరిశ్రమల ఏర్పాటు, ఖనిజ సంపద ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పేరిట అల్లూరి జిల్లా రంపచోడవరంలోని ఐటిడిఎ సమావేశ మందిరంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. రంపచోడవరం డివిజన్‌లోని అన్ని మండలాల ఎంపిపిలు, జడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పలు శాఖల అధికారులు, వివిధ గిరిజన తెగలకు సంబంధించిన నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకుల అభిప్రాయాలు స్వీకరించారు.

ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, శాసన మండలి సభ్యులు అనంత ఉదయ భాస్కర్, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషా దేవి మాట్లాడుతూ.. ఏజెన్సీలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా టూరిజం అభివృద్ధి, మినీ పరిశ్రమలు ఏర్పాటు, ఖనిజ సంపద అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. భూపతిపాలెం, ముసురుమిల్లి ప్రాజెక్టుల అభివృద్ధికి, ఏజెన్సీలోని వివిధ చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. జీడిపిక్కల ప్రాసెసింగ్, పసుపు యూనిట్లు ఏర్పాటు, చింతపండు, చీపుర్లు ప్రాసెసింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఏజెన్సీలోని పాడి పరిశ్రమ ద్వారా మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆశ్రమ పాఠశాలలకు పాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. శాసనమండలి సభ్యులు అనంత ఉదయ భాస్కర్ మాట్లాడుతూ విడివికెలు, వెలుగు ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలని, టూరిజం ప్రాంతంలో గిరిజనులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీకి, ఎమ్మెల్సీ వైసిపికి చెందిన వారైనప్పటికీ ఇద్దరూ అడవిని సంపన్నులకు కట్టబెడుతున్న రీతిలోనే మాట్లాడడంతో జనం విస్తుపోయారు. రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ బాధితుల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలలో ఎక్కడైనా తూకాలలో మోసం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు మాట్లాడుతూ.. రాజవొమ్మంగి, అడ్డతీగల ప్రాంతాల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మినీ పరిశ్రమలు నెలకొల్పాలని, చెరువులకు మరమ్మతులు చేయాలని, పోడు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. జీడి మామిడి పిక్కల కొనుగోలు కేంద్రాలలో తూకాలలో మోసాలను నిర్మూలించాలని, గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఆదివాసి ఐక్యవేదిక సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబూరావు, ఆదివాసీ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం నాయకులు కత్తుల ఆదిరెడ్డి మాట్లాడుతూ ఆదివాసీలకు నష్టం చేకూర్చే విధంగా గిరిజన చట్టాలను మార్పు చేయరాదన్నారు. వాటిని పటిష్టంగా అమలు జరపాలని కోరారు. చట్టాలకు లోబడే మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఆదివాసీ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మారేడుమిల్లి జడ్‌పిటిసి సభ్యులు గొర్లె బాలాజీబాబు, మారేడుమిల్లి వైస్ ఎంపిపి రవికుమార్, సర్పంచ్ కొండ జాకోబ్, వై.రామవరం మండల ఎంపిపి కె.ఆనంద్, జడ్డంగి సర్పంచ్ మురళీకృష్ణ, గంగవరం జడ్‌పిటిసి సభ్యులు పల్లాల కృష్ణారెడ్డి, దేవీపట్నం ఎంపిపి మురళీ, రంపచోడవరం జడ్‌పిటిసి సభ్యులు పండ వెంకటలక్ష్మి, రంపచోడవరం ఎంపిపి బంధం శ్రీదేవి, సర్పంచ్ మంగ బొజ్జయ్య మాట్లాడుతూ గిరిజన రైతులకు సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని, కోతులు నిర్మూలించాలని, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మైనింగ్‌కు సంబంధించి సొసైటీ లు ఏర్పాటు చేయాలని, సూరంపాలెం, భూపతిపాలెం ప్రాజెక్టుల ద్వారా గిరిజన రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని, సోలార్ బోర్లు ఏర్పాటు చేయాలని, పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

హౌసింగ్ ఎమ్‌డిగా శివప్రసాద్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డిగా ఎం శివప్రసాద్‌ను ప్రభుత్వం (ఎఫ్‌ఎసి)గా నియమించింది. ఈ మేరకు బుధవారం జిఓ ఆర్‌టి నెంబరు 686ను విడుదల చేసింది. ఆయన ఇప్పటి వరకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో హౌసింగ్ జెఎమ్‌డిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పటి వరకు హౌసింగ్ ఎమ్‌డిగా పనిచేస్తున్న రాజబాబును ఎపిపిఎస్‌సి సెక్రటరీగా ప్రభుత్వం మంగళవారం నియమించిన సంగతి తెలిసిందే.

కొత్తగా 42 సహాయ పిపి పోస్టుల భర్తీకి అనుమతి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో కొత్తగా 42 సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆర్థికశాఖ అనుమతినిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలను ఎపి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నిర్వహించనున్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని హోంశాఖ, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ శాఖలను ఆర్థికశాఖ కోరింది. ప్రాసిక్యూషన్ విభాగాన్ని బలోపేతం చేయాలంటూ హైకోర్టు కూడా సూచించిన విషయం తెలిసిందే.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సిపిఎస్ ఉద్యోగులపై అక్రమ కేసులను ఉపసంహరించాలి

- ఎపి సిపిఎస్ఇఎ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఎస్ ఉద్యోగులపై గతంలో అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిజిపి హరీష్ గుప్తాను ఎపిసిపిఎస్ఇఎ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. మంగళగిరిలోని పోలీస్ కేంద్ర కార్యాలయంలో డిజిపి హరీష్ గుప్తాను, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సతీష్, సిఎం దాస్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా సిపిఎస్ ఉద్యోగులపై గతంలో 3,023 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసుల వివరాలను డిజిపికి అందజేశారు. కేసులను ప్రాసెస్ చేసి త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తామని డిజిపి హామీ ఇచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సిపిఎస్ ఉద్యోగులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేస్తామని శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించినట్లు చెప్పారు. డిజిపిని కలిసిన వారిలో ఎపి ఎన్‌జిఒల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్, వెస్ట్ కృష్ణా ప్రధాన కార్యదర్శి పి రమేష్, హెచ్‌ఒడి సిపిఎస్ ఎంప్లాయీస్ కన్వీనర్ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌లో రాష్ట్రానికి 2 అవార్డులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ధ్రువీకరణ, చిన్నపిల్లల ఆధార్ నమోదును నిర్వహించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విభాగంలో రాష్ట్రానికి రెండు అవార్డులు దక్కాయి. ఇందుకు సంబంధించి ఈ నెల 8న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సంబంధిత నోడల్ ఆఫీసర్లు/సెక్షన్ ఆఫీసర్లు అవార్డులను కలెక్ట్ చేసుకోవాలని సెక్షన్ ఆఫీసరు ఇ అండ్‌యు-1 మాణిక్ గోయల్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

గంజాయి ముఠా అరెస్టు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్ (ప్రకాశం జిల్లా)

గంజాయి విక్రయించే ముఠాను ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం మార్కాపురం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి యు.నాగరాజు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ముందుగా అందిన సమాచారం మేరకు ప్రకాశం జిల్లా మార్కాపురంలోని ఎస్టేట్ ఏరియాలోని సెంటెన్స్ స్కూల్ దగ్గర అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతరుల సాయంతో పట్టణానికి చెందిన సుంకర మధు వెంకట గోపీనాథ్ అనే వ్యక్తి అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో గంజాయి ఆకును కొనుగోలు చేసి మార్కాపురం పట్టణానికి తీసుకొచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి పాడి తిరుమలయ్య, షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తులకు గంజాయి అమ్ముతుండగా ముగ్గురినీ అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

మాదకద్రవ్యాల కేసుల్లో పట్టుబడితే ఆస్తుల జప్తు

- హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మాదక ద్రవ్యాల కేసుల్లో పట్టుబడితే ఆస్తులు జప్తు చేస్తామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శ్రీకాకుళంలోని ఎస్‌పి కార్యాలయంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్‌పిలు, పోలీసు అధికారులతో ఆమె బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి అనిత విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా కేవలం కేసుల నమోదుకే పరిమితం కాకుండా, వారి ఆర్థిక మూలాలను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఆ పని ప్రారంభమైందని తెలిపారు. డ్రోన్లు, సిసి కెమెరాల సాయంతో కొన్ని కేసులను 48 గంటల్లోనే చేధిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాల అదుపునకు ప్రతి జిల్లాలో ఒక సైబర్ స్టేషన్ ఏర్పాటుతోపాటు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. పోక్సో కేసుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని వెల్లడించారు. గంజాయి సాగు, రవాణా, కొనుగోలు చేసిన వారిపై పిడి యాక్టు పెడుతున్నామని చెప్పారు. పోలీసు ఉద్యోగాల భర్తీకి సంబంధించి న్యాయపరమైన ఇబ్బందులను పరిష్కరించి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

అంతా జగన్నాటకమే..

హెలికాప్టర్ వివాదంపై హోంమంత్రి అనిత

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాటకాలాడుతున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. హెలికాప్టర్ వివాదంపై విశాఖలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గానికి వెళ్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అక్కడి పరిస్థితుల దృష్ట్యా 1100 మంది పోలీసులతో రక్షణ ఇచ్చామని తెలిపారు. 250 మంది పోలీసులు హెలిపాడ్ వద్ద ఉన్నారని వివరించారు. విఐపిని తీసుకెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ అన్నారని, తర్వాత 15 నిమిషాల్లో అది ఎలా ఎగిరి వెళ్లిందని ప్రశ్నించారు. వీటన్నింటిపైనా విచారణ కొనసాగుతుందని తెలిపారు.



నవనీత కృష్ణాలంకారంలో రామయ్య

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారికి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం రాములవారిని నవనీత కృష్ణునిగా అలంకరించారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా సాగింది.

కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

సీతారాముల వారి కల్యాణానికి తిరుమల లడ్డూ సిద్ధం

ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసే యాత్రికులకు అందించేందుకు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు సిద్ధమయ్యాయి. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్- 2లో బుధవారం శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్ నిర్వహించారు. డిప్యూటీ ఇఒ (జనరల్) శివప్రసాద్, ఎఇఒ బాలరాజు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది శ్రీవారి సేవకులు 70 వేల లడ్డూలను ప్యాకింగ్ చేశారు. ఏప్రిల్ 11న కడప జిల్లా ఒంటిమిట్టలో జరిగే కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే యాత్రికులకు ఈ లడ్డూలను ప్రసాదంగా అందజేయనున్నారు.

భారాలు మోయలేం

- గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ కట్టెలపై వంట
- ఖాళీ సిలిండర్లతో ప్రదర్శనలు, ధర్నాలు

ప్రజాశక్తి-యంత్రాంగం



నంద్యాల జిల్లా బేతంచెర్లలో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు, ధర్నాలు చేశారు. 'మేము భారాలు మోయలేం' అంటూ ఖాళీ గ్యాస్ సిలిండర్‌లను ప్రదర్శిస్తూ, కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన ప్రదర్శనలు చేశారు. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెను భారంగా మారిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్యామలా సెంటర్ వద్ద, కాకినాడ జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించారు. ఖాళీ గ్యాస్ బండలతో ధర్నాలో పాల్గొన్నారు. గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని నినదించారు. రాజమహేంద్రవరంలో ధర్నాను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ఒకేసారి రూ.50 పెంచి ప్రజలపై పెనుభారం మోపారన్నారు. మోడీ ప్రభుత్వం అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రులో కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ, పల్నాడు జిల్లా నరసరావుపేట స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్క్ వద్ద ఖాళీ గ్యాస్ సిలిండర్లను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. విశాఖ జివిఎంసి 59వ వార్డు పరిధిలోని నెహ్రూనగర్ జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో గ్యాస్ బండలతో నిరసన ప్రదర్శన చేశారు. అల్లూరి జిల్లా అరకులోయ మండలం బొండం పంచాయతీ కొత్తవలసలో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద గ్యాస్ సిలిండర్ భారాన్ని 'మేము మోయలేం' అంటూ నినాదాలు చేస్తూ ఖాళీ సిలిండర్లను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. బేతంచెర్లలో పాత బస్టాండ్‌లోని భారత్ బేకరీ సర్కిల్‌లో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. నందికొట్కూరు, డోన్ పట్టణ కేంద్రాల్లో ఆందోళనలు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో గ్యాస్ బండపై కట్టెలు వెలిగించి వంట చేస్తూ నిరసన తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కోనేరు సెంటర్‌లో ధర్నా చేశారు. శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పలాస, టెక్కలి, ఆమదాలవలస మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్ మండలం నవాబుపాలెం, యలమంచిలి మండలం చించినాడ, ఉండిలో ఖాళీ గ్యాస్ బండలను ప్రదర్శించారు. ఇరగవరం, ఆకివీడు, కాళ్ల, తాడేపల్లిగూడెంలో ధర్నాలు చేశారు. ఏలూరు జిల్లా పోలవరం మండలంలో నిరసనలు తెలిపారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్ష విరమణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట గత 16 రోజులుగా చేస్తున్న రిలే దీక్షలను డిస్కం అధికారుల సమక్షంలో బుధవారం విరమించారు. కార్మికుల డిమాండ్లపై ఒప్పందం కుదిరిన నేపథ్యంలో బుధవారం దీక్ష విరమించారు. హెచ్‌ఆర్ డైరెక్టర్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ.. తమ పరిధిలో ఉన్న సమస్యలన్నింటినీ తామే పరిష్కరిస్తామని, తమ పరిధిలో లేని వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. వేతనాల పెరుగుదల, పిఆర్ అరియర్స్, వాచ్‌మెన్ల నుంచి షిఫ్ట్ ఆపరేటర్లుగా మారిన కార్మికుల జీతాల పెంపు తదితర అంశాలను హెచ్‌ఆర్ కమిటీలో అజెండాగా చేరుస్తామని, సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. సబ్ స్టేషన్‌లలో పనిచేసే కార్మికులను క్షేత్రస్థాయికి పంపడానికి వీల్లేదని రాతపూర్వక ఆదేశాలు పంపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నేత శివప్రసాద్ రెడ్డి, కాంట్రాక్టు కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి కథనాలపై టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ, కేడర్ మీద సాక్షిలో అసత్య కథనాలు పబ్లిష్ అవుతున్నాయని డిజిపి హరీష్‌కుమార్ గుప్తాకు టిడిపి నేతలు బుధవారం ఫిర్యాదు చేశారు. అసత్య కథనాలతో సమాజంలో విషం చిమ్మడమే పనిగా పెట్టుకుందని నేతలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి జగతి పబ్లికేషన్ ఎడిటర్స్ అండ్ డైరెక్టర్స్‌పై చర్యలు తీసుకోవాలని డిజిపిని కోరారు. ఇటీవల పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పశువేముల గ్రామానికి చెందిన హరిశ్చంద్ర తెలంగాణలో ఉంటూ పింఛన్ కోసమని తన ఊరికి వస్తే టిడిపి గూండాలు కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేశారంటూ సాక్షిలో అసత్య వార్తలు ప్రచురించారని పేర్కొన్నారు. అసలు నిజం అతనికి, అల్లుడుకు మధ్య భూ వివాదాల కారణంగా హత్య జరిగితే వాస్తవాన్ని పక్కన బెట్టి టిడిపిపై బురదజల్లడమే పనిగా ఆ పత్రికలో విషయం చిమ్మారన్నారు. అదేరోజు సాక్షి తెలంగాణ ఎడిషన్‌లోనే మామా అల్లుళ్ల మధ్య భూ పంచాయతీలో హరిశ్చంద్రను హతమార్చారని రాశారని డిజిపి దృష్టికి తీసుకెళ్లారు. సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా వారి రాతలు ఉన్నా యని, సాక్షి మీడియాపై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజాస్వామ్యా నికి ముప్పు వాటిల్లుతుందన్నారు. డిజిపిని కలిసి ఫిర్యాదు చేసిన వారిలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, బుచ్చిరాంప్రసాద్ ఉన్నారు.

వచ్చే ఖరీఫ్‌కు వెలిగొండ నుంచి నీరు విడుదల : మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



వెలిగొండ రిజర్వాయర్ నుంచి 2026 జూన్ నాటికి ఆయకట్టు రైతులకు సాగునీరందించే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు జనవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ ప్రాజెక్టు పనుల పురోగతిపై సచివాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల కిందట ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు నేటికీ పూర్తవ్వకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. నిర్వాసితులకు రూ.880 కోట్ల పరిహారం అందాల్సి ఉండగా, గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. వెలిగొండ పూర్తవ్వాలంటే రూ.4 వేలకోట్లు కావాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం వెలిగొండ ప్రాజెక్టు పనులు పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. టన్నెల్‌లో ఉన్న టిబిఎం యంత్రం తొలగించడానికి కోర్టు కేసు అడ్డంకిగా ఉన్న నేపథ్యంలో బైపాస్ టన్నెల్ నిర్మాణం సాధ్యాసాధ్యాలపై చర్చింస్తున్నామని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్, టన్నెల్, ఫీడర్ కాలువలు, పునరావాస కాలనీల నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. జగన్ హయాంలో వెలిగొండను పూర్తి చేసినట్లు అబద్ధాలు చెప్పి జాతికి అంకితం చేశారని చెప్పారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇన్‌సి వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు సిఇ, ఎస్ఇ, ఇఇలు, డిఇలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.



స్మశానంలో బాలికను కాల్చివేసిన దశ్యం

చంద్రగిరిలో కులదురహంకార హత్య..?

- బాలిక అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నరశింగాపురంలో దారుణం చోటు చేసుకుంది. బాలిక అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. అయితే ఇది కులదురహంకార హత్యేనా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం గ్రామానికి చెందిన దళిత యువకుడు అజయ్ చంద్రగిరి మండలం నరశింగాపురం దారిలోని కొత్తూరు దళితవాడలో ఉంటున్న తన సోదరి ఇంటికి తరచూ వచ్చి వెళుతుండేవారు. ఈ నేపథ్యంలో నరశింగాపురం కాలనీకి చెందిన 17 ఏళ్ల బాలిక (బిసి సామాజిక తరగతి)ను అజయ్ ప్రేమించారు. ఆరు నెలల క్రితం బాలిక గర్భం దాల్చడంతో కుటుంబసభ్యులు అబార్షన్ చేయించారు. అప్పట్లో కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అజయ్‌పై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. జైలులో ఉన్న అజయ్‌ను బాలిక కలిసేది. ఈ విషయం ఇంట్లో తెలిసి బాలికను వేధింపులకు గురిచేస్తూ వచ్చారు. గురువారం బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గంటల వ్యవధిలోనే కుటుంబ సభ్యులు బాలిక మృతదేహాన్ని కాల్చివేసినట్లు సమాచారం. హత్య చేశారా..? ఆత్మహత్య చేసుకుందా? అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. డిఎస్‌పి ప్రసాద్, సిఐ సుబ్బిరామిరెడ్డి, ఎస్ఐ అనిత సంఘటనా స్థలంలో పరిశీలించారు.

రుణం చెల్లించలేదని ఇంటికి తాళం వేసిన ఫైనాన్స్ ఏజెంట్లు

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-భట్టిప్రోలు (బాపట్ల జిల్లా)

ఇంటిని తాకట్టు పెట్టి తీసుకున్న రుణాన్ని చెల్లించడం లేదని ఫైనాన్స్ కంపెనీ వారు ఇంటికి తాళం వేశారు. దీంతో మనస్తాపానికి గురైన మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం...వెల్లటూరు గ్రామం చెన్నకేశవనగర్ కాలనీకి చెందిన దంపతులు బాణావత్ పార్వతి (45), భర్త గోవిందు రెండేళ్ల క్రితం ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ వద్ద ఇల్లు తాకట్టు పెట్టి.. రూ.మూడు లక్షల రుణం తీసుకున్నారు. కొంతకాలం పాటు రుణాన్ని చెల్లించారు. నాలుగైదు నెలలుగా రుణం చెల్లించకపోవడంతో ఫైనాన్స్ ఏజెంట్లు మంగళవారం గ్రామానికి వచ్చి ఇంటికి తాళం వేశారు. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు ఏజెంట్లతో మాట్లాడారు. వెంటనే రుణం చెల్లించాలని చెప్పి ఇంటి తాళం ఇచ్చి వెళ్లిపోయారు. ఈ ఘటన నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన పార్వతి మంగళవారం సాయంత్రం ఇంటి వద్దనే ఉరి వేసుకున్నారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను తెనాలి వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం పార్వతి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు

- రాష్ట్ర కమిటీకి ఛైర్మన్‌గా సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అగ్రిగోల్డ్ ఆస్తులు వేలం వేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను నియమించింది. రాష్ట్ర కమిటీకి ఛైర్మన్‌గా సిఎస్ వ్యవహరించనున్నారు. ఈ మేరకు బుధవారం జిఓ ఆర్‌టి నెంబరు 519ని విడుదల చేసింది. ఏలూరు స్పెషల్ కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ కమిటీలను నియమించింది. రాష్ట్రస్థాయి కమిటీకి మెంబర్లుగా సమాచార పౌరసంబంధాలశాఖ సెక్రటరీ, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీశాఖ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్, మున్సిపల్‌శాఖ స్పెషల్ సెక్రటరీ, రిటైర్డ్ డిజిపి, ఆర్‌టిసి ఎమ్‌డి సిహెచ్ ద్వారకా తిరుమలరావు, ప్లానింగ్ బోర్డు మాజీ వైస్ ఛైర్మన్ టి కుటుంబరావు, అగ్రిగోల్డ్ సంస్థ తమ సభ్యుడిని ఏలూరు కోర్టుకు సూచిస్తుంది, వారిని ఆథరైజ్డ్ మెంబరుగా నియమిస్తారు. జిల్లా స్థాయి కమిటీల్లో జాయింట్ కలెక్టర్/రెవెన్యూ డివిజనల్ ఆఫీసరు, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు, డిస్ట్రిక్ట్ ఐటి ఆఫీసరు, ఇ ఆక్షన్స్, అడిషనల్ ఎస్‌పి/డిఎస్‌పి, సిఐడి ఎపి, మున్సిపల్‌శాఖ ఎఒ, అగ్రిగోల్డ్ సంస్థ సూచించే వ్యక్తిని ఏలూరు కోర్టుకు సూచించిన వారిని ఆథరైజ్డ్ మెంబరుగా నియమిస్తారు.

ఇకపై డిప్యూటీ ఎంపిడిఒలుగా ఇఒఆర్‌డిలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్ వ్యవస్థలో పనిచేస్తున్న పంచాయతీ విస్తరణాధికారులు (ఇఒపిఆర్ అండ్ ఆర్‌డి) కేడర్‌ను డిప్యూటీ ఎంపిడిఒలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఎపి పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసు రూల్స్ 2001కి సవరణ చేస్తూ ఆ శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధించి గెజిట్‌ను బుధవారం విడుదల చేసింది. కింద స్థాయి ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించే లక్ష్యంతో ఎంపిడిఒ పోస్టులను నేరుగా కాకుండా, ఉద్యోగోన్నతులతో మాత్రమే భర్తీ చేయనున్నారు. ఎంపిడిఒ, డిఎల్‌డిఒల రెండు పోస్టులు ఒకే కేడర్‌గా పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సిఇఒ, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా అభివృద్ధి అధికారి పోస్టుల్లో 33 శాతం పోస్టులను నేరుగా భర్తీ చేస్తారు. మిగిలిన వాటిని ఉద్యోగోన్నతులతో భర్తీ చేయనున్నారు. జడ్‌పి సిఇఒ పోస్టుల్లో 50 శాతం ఐఎఎస్‌లను నియమించే విధంగా నిబంధనల్లో మార్పులు చేశారు. ఎన్నో ఏళ్లుగా పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగోన్నతులు నోచుకోని ఉద్యోగులకు ప్రభుత్వ నిర్ణయంతో ఊరట లభించిందని పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లులూ ప్రాజెక్టును మరో ప్రాంతానికి మార్చండి

- ముఖ్యమంత్రికి ప్రొఫెసర్ కెఎస్ చలం లేఖ

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ ఆర్‌కె బీచ్‌లో ఏర్పాటు చేయనున్న లులూ ప్రాజెక్టును వేరే చోటుకు మార్చాలని బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక అధ్యక్షులు కెఎస్ చలం లేఖ రాశారు. గతంలో ప్రజా ఉద్యమం ద్వారా దీనిని వద్దనుకున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా బీచ్‌లో ఆదివారం పూట అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉందని, ట్రాఫిక్ గందరగోళంగా ఉంటుందని, అటువంటి ప్రదేశంలో రోజు రెండు వేలమంది కార్లు, మంది మార్బలంతో అక్కడ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. సిఆర్‌జడ్ రేగ్యులేషన్‌లో 500 మీటర్లలోపు ఉందని, గతంలో జరిగిన విధంగా భవిష్యత్తులోను వ్యాజ్యాలకు, వివాదాలకు దారి తీయవచ్చని అభిప్రాయపడ్డారు. కావున ఈ ప్రాంతంలో పెట్టుబడి పెట్టాలనుకునే ఉత్సాహవంతులతో చర్చించి లులూ ప్రాజెక్టను ఆర్‌కె బీచ్‌లో కాకుండా వేరే ప్రాంతానికి మళ్లించాలని కోరారు.

మహిళలు స్నానం చేస్తుండగా వీడియో తీసిన ఆర్‌ఎంపి

- దేహశుద్ధి చేసిన స్థానికులు
- పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని రాయగడ రోడ్డులో ఒక భవనం పైఅంతస్తులో అద్దెకు ఉంటున్న ఆర్‌ఎంపి వైద్యుడు.. మహిళలు స్నానం చేస్తుండగా వీడియోలు తీయడంతో గమనించిన స్థానికులు అతడికి దేహశుద్ధి చేశారు. బెంగాల్‌కు చెందిన ఆర్‌ఎంపి వైద్యుడు బి సర్కారు గత ఆరు నెలలుగా రాయగడ రోడ్డులోని ఉన్న డాక్టర్ వసంత్‌కుమార్ డాక్టర్ హాస్పిటల్ మేడపై రూమ్ అద్దెకు తీసుకొని భవాని పైల్స్ క్లినిక్ పేరిట ఆస్పత్రి నడుపుతున్నాడు. ఆపరేషన్ లేకుండా మూలవ్యాధి తగ్గిస్తానంటూ ప్రచారం చేస్తున్నారు. గురువారం ఉదయం ఆ భవనం దిగువన ఉన్న చిన దేవర వీధిలో బాత్ రూమ్‌ల్లో స్నానం చేస్తున్న మహిళలను సెల్‌ఫోన్‌తో మేడపై నుంచి సర్కారు వీడియో తీశారు. ఇది గమనించి మహిళలు కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు అతడి వద్దకు వెళ్లి దేహ శుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సర్కారును పోలీసులు అరెస్టు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ మురళీధర్ ఆదేశాలతో పట్టణ ఎస్ఐ కేసు దర్యాప్తు చేపస్తున్నారు. సర్కారు గతం నుంచి ఇలా వీడియోలు తీస్తున్నారని మహిళలు ఆరోపించారు.

త్వరలో ఔషధాలపై యుఎస్ టారిఫ్‌ల మోత

వాషింగ్టన్ : ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధానికి తెరలేపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఔషధ రంగాన్ని టార్గెట్ చేసుకున్నారు. త్వరలోనే ఔషధ ఉత్పత్తులపై సుంకాల మోత మోగించనున్నట్లు ప్రకటించారు. అమెరికాకు దిగుమతయ్యే ఔషధ ఉత్పత్తులపై భారీ ఎత్తున సుంకాలు విధించనున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెషనల్ కమిటీ కార్యక్రమంలో మాట్లాడుతూ.. యుఎస్ ఫార్మా ఉత్పత్తులు తయారు కావడం లేదన్నారు. అందుకే ఇతర దేశాల నుంచి వచ్చే ఔషధ ఉత్పత్తులపై సుంకాలు విధించనున్నట్లు తెలిపారు. ఈ చర్యతో చైనా సహా వివిధ దేశాల్లోని ఫార్మా కంపెనీలన్నీ అమెరికాకు తరలివస్తాయని, ఇక్కడ తమ ప్లాంట్లను తెరుస్తాయని పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయంతో భారత్‌కు పెద్ద ఎదురుదెబ్బే అని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాకు భారత్ నుంచి 9 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.78వేల కోట్లు)విలువైన ఔషధాలు ఎగుమతి అవుతున్నాయి. భారత్ చేసుకుంటున్న దిగుమతులతో పోల్చితే ఇది 10 రెట్లు అధికం. అమెరికాలో లభించే జనరిక్ ఔషధాల్లో దాదాపు 70 శాతం దిగుమతి అయినవే. ఇందులో సుమారు 50 శాతం భారత్ నుంచి వెళ్లినవే కావడం విశేషం.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కరువు

- రూ.42కే చింతపండు సేకరణ
- చీపుర్లకూ అత్తెసరు ధర
- స్థానిక దళారులతో ఫారెస్ట్ అధికారుల కుమ్మక్కు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో అటు ప్రభుత్వం, ఇటు జిసిసి (గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్) తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. ముఖ్యంగా చింతపండు సేకరణ ధర తక్కువగా ఉంది. కొండ చీపుర్లకూ తగిన ధర రానివ్వడం లేదు. ఇప్ప పువ్వు, నరమామిడి చెక్క, కొండతామర బంక, నల్ల జీడిపిక్క తదితర అటవీ ఉత్పత్తుల సేకరణకు జిసిసి ముందుకు రావడం లేదు. దీంతో, గిరిజనులు దళారుల బారినపడుతున్నారు. ఇదే విషయమై గత నెలలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలోనూ సిపిఎం నాయకులకు గిరిజనులు విన్నవించారు.

పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, సాలూరు, పాచిపెంట, మెంటాడ, సీతంపేట ఏజెన్సీలో చింతపండు విస్తారంగా పండుతోంది. కొండకోనలు, గిరిశిఖరాలపై గిరిజనులు అష్ట కష్టాలు పడి చింతపండును సేకరిస్తారు. ఏటా సుమారు 12 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. జిసిసి 7,200 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు 3,300 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. మంచి రంగు, రుచి ఉండడంతో ఇక్కడి చింతపండుకు డిమాండ్ ఎక్కువ. అందువల్లే స్థానిక వ్యాపారులతోపాటు దూర ప్రాంతాల నుంచి కూడా ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో మన్యం జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి దళారులు వస్తుంటారు. ప్రస్తుతం కిలో చింతపండు ధర బయట మార్కెట్‌లో రూ.120 వరకు ఉంది. పిక్కతీసిన చింతపండు ధర బహిరంగ మార్కెట్, షాపింగ్ మాల్స్‌లో కిలో రూ.180 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. ఇదే చింతపండును జిసిసి కేవలం కిలో రూ.36ల చొప్పున ఇటీవల కాలం వరకు కొనుగోలు చేసింది. చింతపండు దోపిడీని అరికట్టి కనీసం రూ.50 గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఇటీవల మన్యం జిల్లాలో ఆందోళనలు జరిగాయి. ఈ నేపథ్యంలో జిసిసి



కురుపాం ఏజెన్సీలో దళారులు కొనుగోలు చేస్తున్న చింతపండు

రూ.42కు పెంచింది. రూ.50 ధర కోసం మరో పోరాటం చేస్తామని గిరిజనులు, వారి తరపున సిపిఎం, గిరిజన సంఘం నాయకులు చెబుతున్నారు.

మన్యం జిల్లాలోని అటవీ ఉత్పత్తుల్లో చింతపండు తరువాత అంతలా గిరిజనులు సేకరించేది కొండ చీపుర్లు. ధృఢంగా ఉండడంతో ఒడిశా నుంచి దిగుమతి అవుతున్న చీపుర్లకంటే మన్నిక ఎక్కువ. ఈ నేపథ్యంలో సీతంపేట, భామిని, పాలకొండ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలోని చీపుర్లకు మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది కూడా వీటి కొనుగోలుకు జిసిసి తొలుత మీనమేషాలు లెక్కించింది. సిపిఎం, గిరిజన సంఘం ఒత్తిడి, పోరాట ఫలితంగా రూ.40 చొప్పున సేకరిస్తున్నప్పటికీ అది నామమాత్రంగానే ఉంటోంది. అయితే, ఈ ధర గిట్టుబాటు కావడంలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన దళారులు రూ.42 చెల్లిస్తున్నారు. తెల్ల చీపుర్లు రూ.60, నల్ల చీపుర్లు రూ.50ల చొప్పున కొనుగోలుకు ముందుకు వస్తున్నప్పటికీ, స్థానిక దళారులతో కుమ్మక్కైన ఫారెస్ట్ అధికారులు జిసిసికి మాత్రమే విక్రయించాలంటూ మెలికపెడుతున్నారు. లేదంటే కేసులు పెడతామంటూ హెచ్చరించడంతో స్థానిక దళారులకు రూ.42ల చొప్పున విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. కనీసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దళారులు ఇస్తున్న ధర రకాన్ని బట్టి రూ.50, రూ.60 చొప్పునైనా జిసిసి కొనుగోలు చేయాలని, సిపిఎం, గిరిజన సంఘం డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పపువ్వు, నరమామిడి చెక్క, కొండతామర బంక, నల్ల జీడిపిక్క తదితర అటవీ ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేసేది. ప్రస్తుతం వాటిని కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఎంతోకొంతకు దళారులకు కట్టబెట్టాల్సివస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధర కల్పించే వరకు పోరాటం



అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే వరకు పోరాడతాం. చింతపండు, చీపుర్లు సేకరణ, విక్రయంలో గిరిజనుల కష్టానికి తగిన ఫలితం రావడం లేదు. జిసిసి మొక్కుబడిగానే కొనుగోలు చేస్తోంది. కష్టమంతా దళారులపాలవుతోంది. ఈ నేపథ్యంలో జిసిసి చింతపండు కిలో రూ.50కు, చీపుర్లు రకాన్ని బట్టి రూ.50 నుంచి రూ.60 వరకు కొనుగోలు చేయాలి. లేదంటే మరో పోరాటం తప్పదు. దళారులతో స్థానిక ఫారెస్ట్ అధికారులు కుమ్మక్కై ధరలు పెరగకుండా చేస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్, ఐటిడిఎ పిఒలు జోక్యం చేసుకోవాలి. గతం మాదిరిగా పలు ఔషదాలకు తయారీకి అవసరమైన ఇప్పపువ్వు, నరమామిడి చెక్క, కొండతామర బంక తదితర గిరిజన ఉత్పత్తులను కూడా సేకరించాలి.

ఎం.తిరుపతిరావు,
సిపిఎం పార్వతీపురం మన్యంజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

జీడి రైతులపైనా నిర్లక్ష్యం



ప్రభుత్వం జీడి రైతులపైనా నిర్లక్ష్యం వహిస్తోంది. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల ఈ ఏడాది జీడి దిగుబడి ఆశాజనకంగా లేదు. అరకొర దిగుబడికి కూడా కనీస మద్దతు ధర కల్పించే విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. అటవీ ఫల సాయాల కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థ గిరిజన ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో గిరిజనులు ప్రయివేట్ దళారుల చేతుల్లో మోసపోతున్నారు.

బి.ఈశ్వరరావు,
వబ్బంగి గ్రామం,కురుపాం మండలం

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు

- శ్రీరామనవమి శోభాయాత్రలో డీజే సౌండ్, మతపరమైన కామెంట్లు..

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

డిజె సౌండ్ పెట్టినందుకు, మతపరమైన వ్యాఖ్యలు చేసినందుకు హైదరాబాద్‌లోని గోషామహల్ బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం శ్రీరామనవమి శోభయాత్రలో భాగంగా ఆకాష్‌పూరి హనుమాన్ టెంపుల్ నుంచి ర్యాలీగా బయలుదేరారు.

ఈ శోభాయాత్రలో డిజె సౌండ్ పెట్టడంతోపాటు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, శోభాయాత్ర ఆర్గనైజర్ రాజాసింగ్ ప్రసంగిస్తూ మతపరమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. జాలి హనుమాన్ దేవాలయం సమీపంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో పోలీసులు లాఠీఛార్జి చేస్తే తిరిగి తాము కూడా లాఠీఛార్జి చేస్తామని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. దాంతో ఎమ్మెల్యేతోపాటు మరో ఇద్దరు ఆర్గనైజర్లు భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి అధ్యక్షులు భగవంతారావు, శ్రీరామనవమి పల్లకి సేవా శోభాయాత్ర నిర్వాహకుడు ఆనంద్ సింగ్ లోథ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



విశాఖ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి

విశాఖలో వైఎస్ జగన్‌పై ఫిర్యాదులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ (విశాఖపట్నం)

పోలీసులను బట్టలూడదీసి నిలబెడతానన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలపై విశాఖలోని పోలీసు స్టేషన్లకు బుధవారం ఫిర్యాదులందాయి. ఎంవిపి పోలీసుస్టేషన్‌లో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.ప్రణవ్‌గోపాల్ ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో టిడిపి విశాఖపట్నం పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, జివిఎంసి 33వ వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి విల్లూరి తిరుమలదేవి ఫిర్యాదు చేశారు. నిరంతరం చట్టాన్ని పరిరక్షించే పోలీసుల స్థాయిని తగ్గించేలా ప్రజలలో చులకన భావం కలిగించేలా జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని వారు పేర్కొన్నారు. వెంటనే పోలీస్ శాఖకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన్ను అరెస్టు చేయాలని కోరారు.

వెట్టిచాకిరీపై విచారణ

- నేరం రుజువుకావడంతో జరిమానా

ప్రజాశక్తి-రేపల్లె (బాపట్ల జిల్లా)

తమతో 15 ఏళ్లుగా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని బాపట్ల జిల్లా కలెక్టర్‌కు ఎస్‌టి దంపతులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో లేబర్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా లేబర్ ఆఫీసర్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. వెట్టిచాకిరీపై ఫిర్యాదు చేసిన దంపతులను, వెట్టిచాకిరీ చేయిస్తున్న యజమానిని విచారణ చేశామన్నారు. యజమాని చెన్ను ఆదిశేషరావుపై నేరం రుజువు కావడంతో బాండెడ్ లేబర్ చట్టం కింద భారీ జరిమానా విధించామన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కార్మికులను నిర్బంధించి వెట్టిచాకిరీ చేయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోకో రైతుల సమస్యలపై పోరాటం

- 15న చలో గుంటూరు ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం
- 12న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు
- ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర సమావేశం పిలుపు

ప్రజాశక్తి - పెదవేగి

కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం విజయరాయి గాంధీనగర్‌లోని సీతారామ కల్యాణ మండపంలో ఎపి కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన బుధవారం సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. కోకో గింజల కొనుగోలు, కంపెనీల మోసాలు, కొనుగోలు ధరల తగ్గింపుపై ఈ నెల 12న కోకో సాగు చేస్తున్న అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు, 15న కోకో రైతుల చలో గుంటూరు రాష్ట్ర కమిషనర్ కార్యాలయ కార్యక్రమం చేపట్టాలని సమావేశం పిలుపునిచ్చింది. కోకో రైతులందరూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజలు కొనుగోలు, ధర ఒప్పంద ప్రకటన చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ నెల 7వ తేదీ నాటికి ధరల ఒప్పంద నిర్ణయం ప్రకటిస్తామని అచ్చెన్నాయుడు స్వయంగా చెప్పినా ఇంతవరకు ప్రకటన చేయలేదన్నారు. రాష్ట్ర ఉద్యాన శాఖ ఉన్నతాధికారుల నుండి తగిన స్పందన రాకపోవడం అన్యాయమన్నారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలు అడ్డగోలుగా ధరలు తగ్గించి రైతులను ముంచేస్తున్నాయని తెలిపారు. కిలో కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర రూ.700కు పైగా ఉన్న అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ నిర్ణయం ప్రకటించకుండానే మోండలీజ్ ధరలను పాత గింజలకు రూ.300, కొత్త గింజలకు రూ.550గా ఉద్యాన శాఖ అధికారులు ప్రచారం చేయడం కోకో రైతులకు తీవ్ర నష్టం కలిగించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోకో రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్ గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, కొసరాజు రాధాకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, కోనేరు సతీష్‌బాబు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి, కోకో రైతుల సంఘం వివిధ జిల్లాలకు చెందిన నాయకులు మేడిచర్ల కృష్ణార్జునరావు, ఆలపాటి శ్రీనివాసరావు, చేకూరి సత్యనారాయణ, కె.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటు కోళ్లపై మరోసారి వైరస్ పంజా

- తణుకులో మృత్యువాత పడుతున్న కోళ్లు

ప్రజాశక్తి - తణుకు రూరల్



మృతి చెందిన కోడి

నాటుకోళ్లపై మరోసారి వైరస్ ప్రభావం కన్పిస్తుంది. అప్పటి వరకూ ఎంతో చురుగ్గా తిరిగిన నాటుకోళ్లు గంటల వ్యవధిలోనే రెక్కలు వాల్చి మృత్యువాత పడుతుండడం పెంపకందారులను కలచివేస్తోంది. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరులో జి కృష్ణానందం పౌల్ట్రీఫారంలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లాలో కలకలం రేగిన సంగతి తెలిసిందే. రెడ్‌జోన్ ఏర్పాటు చేసి నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇది జరిగి రెండు నెలలు కావడంతో ప్రస్తుతం మాంసం ప్రియులు చికెన్ వినియోగిస్తున్నారు. అయితే తాజాగా కొన్ని రోజులుగా మళ్లీ నాటు కోళ్లు అంతుచిక్కని వైరస్‌తో మృత్యువాత పడుతున్నాయి. తణుకు పట్టణానికి చెందిన ఒక పెంపకందారుని కోళ్ల దొడ్డిలో బుధవారం ఒక్కరోజే 20 కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఒక్క కోడి ధర రూ.25 వేలకుపైగానే ఉందని, ఈ తరుణంలో కోళ్లు చనిపోవడంతో రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. తణుకును ఆనుకుని ఉన్న గ్రామంలో ఒక పెంపకందారుని కోళ్లదొడ్డిలో గత శుక్రవారం నుంచి ఇప్పటి వరకు 40 కోళ్లు మృతి చెందినట్లు సమాచారం. దీనిపై సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

ప్రభావతికి మళ్లీ జ్ఞాపక శక్తి రావాలి

- డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - ఉండి (పశ్చిమగోదావరి)

డాక్టర్ ప్రభావతికి మళ్లీ జ్ఞాపకశక్తి రావాలని, ఎంబిబిఎస్‌లో చదివినవి మళ్లీ గుర్తుకు రావాలని ప్రార్థించడం తప్ప, మనం చేసేదేమీ లేదని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు వ్యంగంగా వ్యాఖ్యానించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎఎంసిలో ధాన్యం కొనుగోలు ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా మీడియాతో ఆయన ముచ్చటించారు. తనను సిఐడి పోలీసులు గాయపరిచినా, లేదని నివేదికపై సంతకం చేసిన డాక్టర్ ప్రభావతి... తాను గైనకాలజిస్ట్‌ని, తనకు గాయాలంటే ఏంటో తెలియదని చెప్పడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఎంబిబిఎస్ డాక్టర్లకు దెబ్బలపై కనీస అవగాహన లేదన్నట్లు మాట్లాడడం వెనుక ఎవరి ప్రోద్బలం ఉందో అర్థమవుతోందని పేర్కొన్నారు. తనకు మతిమరుపు ఉంది, తనకేమీ గుర్తు రావడం లేదని ఆమె చెప్పడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టు నుంచి తాత్కాలిక ఉపశమనం దక్కే వరకూ ఎవరికీ కనిపించకుండా మతిమరుపుతో ఎలా ఉన్నారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో ఆమెకు గతం గుర్తొచ్చే ఏర్పాట్లు జరుగుతాయని తాను భావిస్తున్నానని వ్యాఖ్యానించారు.

'కాకాణి' బెయిల్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మైనింగ్ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. విచారణను మూడుసార్లు వాయిదా వేసిన హైకోర్టు బుధవారం బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. అక్రమ మైనింగ్ కేసులో పోలీసులు ఆయనపై 15 రోజుల క్రితం కేసు నమోదు చేశారు. అటు తర్వాత ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదైంది.

బడ్జెట్‌లో పోకో నుంచి పోకో సి71



ప్రజాశక్తి - హైదరాబాద్

స్మార్ట్ ఫోన్ ఉత్పత్తుల కంపెనీ పోకో తన కొత్త పోకో సి71ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల చేసింది. బుధవారం హైదరాబాద్‌లో దీనిని పోకో ఇండియా కంట్రీ హెడ్ హిమాన్షు టాండన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిమాన్షు మీడియాతో మాట్లాడుతూ.. 4జిబి ర్యామ్, 64జిబి స్టోరేజ్ కలిగిన పోకో సి71 ధరను రూ.6,499గా, 6జిబి, 128 జిబి వేరియంట్ ధరను రూ.7,499గా నిర్ణయించామన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ ఏప్రిల్ 10 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. 5200 ఎంఎహెచ్ బ్యాటరీ, 32 ఎంపి డ్యూయల్ కెమెరా, 8ఎంపి కెమెరాలు, సరికొత్త ఆండ్రాయిడ్‌లతో దీన్ని డిజైన్ చేశామన్నారు.



విశాఖ పోర్టు ఎఒబి వద్ద మహాధర్నా చేస్తున్న కార్మికులు

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ రీ-టెండర్ రద్దు చేయాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణకు ఇచ్చిన రీ-టెండర్‌ను రద్దు చేయాలని, సొంత నిధులతోనే ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని, ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని భర్తీ చేయాలని, మెరుగైన వైద్య పరికరాలు అందించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన బుధవారం పోర్టు ఎఒబి వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ.. పోర్టు యాజమాన్యం పిపిపి (పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్) పేరుతో 2024 సెప్టెంబరు 24న టెండర్‌కు పిలిచిందని, కార్మికుల పోరాటం ఫలితంగా ఆ టెండర్ రద్దయ్యిందని తెలిపారు. మరలా మార్చి 3న రీ టెండర్‌ను పిలవడం దుర్మార్గమన్నారు. ఇది 40 వేల మంది ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను ప్రమాదంలోకి నెట్టే ఘోర నిర్ణయమని, దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పి సుమారు ఏడు ఎకరాలు ఉన్న స్థలాన్ని కాజేసేందుకే ఈ ప్రయివేటీకరణ కుట్ర జరుగుతోందని విమర్శించారు. ఏటా రూ.వందల కోట్లు లాభాలు పోర్టు ఆర్జిస్తోందని, ప్రస్తుతానికి సుమారు రూ.3 వేల కోట్ల రిజర్వ్ ఫండ్స్ ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సగటున ఏటా రూ.200 కోట్లు పన్నులు పోర్టు కడుతోందని వివరించారు. ఇలాంటి సంస్థ ఉద్యోగులు, కార్మికులు పొందే వైద్యాన్ని కూడా లాభనష్టాల బేరీజు వేయడం దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి బి.జగన్, అధ్యక్షులు సాంబమూర్తి, కె.సత్యనారాయణ, విడిఎల్‌బి అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కాన సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, నాయకులు వి.రామలింగేశ్వరరావు త్రినాథరావు, నర్సింగరావు, కన్నారావు, పెన్షనర్లు, కార్మికులు పాల్గొన్నారు.

సంపాదకీయం


చెంపపెట్టు!

'నా రెండు నాకియ్యే నాంచారమ్మా...' అని ఒక సామెత. కొందరు తమకు పడాల్సిన నాలుగు దెబ్బలు పడితే తప్ప దారికి రారు. ఇంకొంతమందికి ఎన్ని మొట్టికాయలు పడినా బుద్ధిరాదు. ఈ కోవకు చెందినవారే తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి. ఇటీవల అనేక చారిత్రాత్మక తీర్పులను వెలువరిస్తున్న సుప్రీంకోర్టు...మరో చారిత్రాత్మక తీర్పుతో తమిళనాడు గవర్నర్ గూబ గుయ్ మనిపించింది. బిజెపి భావజాలానికి, బిజెపి పాలిత గవర్నర్ల మితిమీరిన నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు...రాజ్యాంగ భావనను సంపూర్ణంగా సమర్థించే చారిత్రాత్మక తీర్పు. ఈ తీర్పు... సహజంగానే డిఎంకె ప్రభుత్వానికి భారీ విజయం. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఫెడరలిజం బలోపేతానికి జరుగుతున్న పోరాటానికొక ఊతం. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులకో రక్షణ కవచం. ఈ తీర్పు ఒక్క తమిళనాడుకు మాత్రమే పరిమితమైనది కాదు. మొత్తం భారతదేశంలోని రాష్ట్రాలన్నింటికీ సంబంధించినది. జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పులో ఎలాంటి శషభిషలకు తావు లేకుండా... బెరుకు, భయమూ లేకుండా చాలా స్పష్టంగా వుంది. గవర్నర్లంటే... కేంద్ర ప్రభుత్వానికి ఊడిగం చేసే దుస్సంప్రదాయానికి ఈ తీర్పు చెల్లుచీటీ రాసింది.

గవర్నర్ అంటే కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలగవలసిన వ్యక్తి కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని గతంలో 'ఎస్.ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. తాజాగా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా తనవద్దే తొక్కిపెట్టిన గవర్నర్ వైఖరిని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. 'కీలకమైన 10 బిల్లులను ఆమోదించకుండా తన వద్దనే అట్టిపెట్టుకుంటూ ఆయన తీసుకున్న నిర్ణయం, వ్యవహరించిన తీరు చట్టవిరుద్ధం, ఏకపక్షం' అని అభివర్ణించింది. ఒకసారి శాసనసభ బిల్లులను ఆమోదించిన తర్వాత వాటిపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయస్థానం కాలపరిమితిని కూడా నిర్దేశించింది. ఈ బిల్లులకు సంబంధించి గవర్నర్ తీసుకున్న చర్యలన్నీ రద్దవుతాయని, అసెంబ్లీ... గవర్నర్‌కు తిరిగి పంపిన తేదీ నుంచి ఈ బిల్లులన్నీ ఆమోదం పొందినట్లు పరిగణించాలని సుప్రీం స్పష్టం చేసింది. అంతేకాదు, గవర్నర్ రవి చిత్తశుద్ధితో వ్యవహరించలేదని కోర్టు తప్పుబట్టింది. ప్రజలచే ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల సలహా మేరకు గవర్నర్ వ్యవహరించాలని, రాష్ట్రాలను వీటో చేసే అధికారం రాజ్యాంగం వీరికి ఇవ్వలేదని కోర్టు పునరుద్ఘాటించింది. ఎన్నికైన ప్రభుత్వాలు ప్రజావసరాలు, సంక్షేమం కోసం చట్టాలను రూపొందిస్తాయి. వాటిని నిరోధించే వైఖరి రాజ్యాంగ విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుపడటం గవర్నర్ పని కాదని ఎత్తిచూపుతూ...గవర్నర్ రవి అడ్డుకున్న పది బిల్లులను సుప్రీం ఆమోదించింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని సమర్థించే ఈ తీర్పు...అసెంబ్లీ హక్కులను హరించే గవర్నర్ల వైఖరికి ఒక హెచ్చరిక. కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు చెంపపెట్టు లాంటిది.

'రాజ్యాంగం ఎంత మంచిదైనా, దానిని అమలు చేసేవారు సరిగ్గా లేకుంటే అది చెడుగా కనిపిస్తుంది' అని అంబేద్కర్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ఉటంకించిన సుప్రీంకోర్టు పాలకులకు గట్టిగానే చురకలు వేసింది. కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ తాబేదార్లుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. గవర్నర్ల వైఖరిని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం న్యాయపోరాటం చేస్తోంది. కేరళ ప్రభుత్వం లేవనెత్తిన అంశాల ప్రాధాన్యతను, ఔచిత్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్పింది. కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన పలు బిల్లులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వచ్చిన ఈ తీర్పుతో...అస్పష్టతకు తెరపడింది. బిల్లులపై సంతకం చేయడానికి రాజ్యాంగం నిర్దిష్ట సమయాన్ని పేర్కొనలేదని చేసే వాదనలకు సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. భారతీయ సమాఖ్య వ్యవస్థకు మరింత పటుత్వాన్నిచ్చే చారిత్రాత్మక తీర్పునూ ప్రజాస్వామ్యవాదులంతా జేజేలు పలుకుతున్నారు.

మహనీయుల మాట




స్వాతంత్ర్యం మానవులందరి శాశ్వతమైన జన్మ హక్కు శ్రమ సమాజాన్ని పోషించే నిజమైన సాధనం.
- హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ,
భారతీయ ఆంగ్ల కవి, నాటకకర్త, నటుడు, సంగీతకారుడు.

భవిష్యత్ పోరాటానికి సన్నద్ధంగా...

ఏప్రిల్ 11న అఖిల భారత కిసాన్‌సభ ఆవిర్భావ దినోత్సవం

సందర్భం



వై.కేశవరావు

అఖిల భారత కిసాన్ సభ 1936 ఏప్రిల్ 11న లక్నోలో ఏర్పడింది. అప్పటికే వివిధ రాష్ట్రాలలో పని చేస్తున్న రైతు సంఘాల నాయకులందరూ దానికి హాజరయ్యారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా కాంగ్రెస్, కమ్యూనిస్టు, సోషలిస్ట్ పార్టీలకు చెందిన రైతు నాయకులు అందరూ హాజరయ్యారు. ఆ సమావేశంలో మూడు కర్తవ్యాలు రూపొందించారు. 1. భారత స్వాతంత్ర్యం కోసం పోరాటం, 2. జమిందారీ విధానం రద్దు కోసం పోరాటం, 3. ఆర్థిక, సాంఘిక దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాటం. స్వామి సహజానంద సరస్వతి అధ్యక్షుడిగా, ఎన్.జి.రంగా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఎ.ఐ.కె.ఎస్ పతాకంగా ఎర్రజెండాను ఎంపిక చేసుకున్నారు.

ఎ.ఐ.కె.ఎస్ పిలుపుతో దేశం నలుమూలలా రైతాంగం పెద్ద ఎత్తున స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నది. అప్పటివరకు పట్టణాలకు, విద్యావంతులకు పరిమితమైన స్వాతంత్ర్య ఉద్యమం గ్రామీణ ప్రాంతాలలో విస్తరించి సకల ప్రజా ఉద్యమంగా మారింది. మరోవైపు జమీందారుల, వారి తాబేదారుల నిరంకుశాలకు, ఆర్థిక, సాంఘిక దోపిడీలకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభమయ్యాయి. కేరళలో పున్నప్ర-వాయలార్, బెంగాల్‌లో తెబాగా, మహారాష్ట్రలో వర్లి ఆదివాసి, అస్సాంలో సుర్మావాలీ, త్రిపురలో ఆదివాసి పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాలను అణచడానికి సాయుధ బలగాలను ప్రయోగించగా రైతాంగం చెదరకుండా, బెదరకుండా ప్రాణ త్యాగాలతో పోరాడి హక్కులను సాధించుకున్నారు.

ఎ.ఐ.కె.ఎస్ పిలుపుతో ఆంధ్ర రాష్ట్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుండి తడ వరకు చారిత్రాత్మకమైన 'రైతు రక్షణ యాత్ర' జరిగింది. 1512 మైళ్ళు కాలినడకన గ్రామాలు పర్యటిస్తూ జమిందారులు, వారి తాబేదారుల దోపిడీలను దౌర్జన్యాలను వెలికి తీస్తూ రైతాంగాన్ని చైతన్య పరుస్తూ యాత్ర సాగింది. యాత్ర ముగింపుగా దళం సేకరించిన వివరాలతో, మహజర్లతో మద్రాసు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఆ నాటి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. అనంతరం 'ఎస్టేట్ ల్యాండ్ యాక్ట్ చట్టం' వచ్చింది.

ఈ క్రమంలో రాష్ట్ర వ్యాపితంగా జమిందారుల దౌర్జన్యాలకు, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాటాలు విజృంభించాయి. మునగాల, చల్లపల్లి, మందస పోరాటాలలో ఎందరో రైతులు, మహిళల ప్రాణ బలిదానం జరిగింది. అంతిమంగా వీర తెలంగాణ సాయుధ పోరాటం జరిగింది. ఈ పోరాటాల ఫలితం స్వాతంత్ర్యం అనంతరం జమిందారీ విధానం రద్దుకు దారితీసింది. ఈనాముల రద్దు చట్టం, కౌలుదారీ చట్టాలు, భూసంస్కరణల చట్టాలు వచ్చాయి.

ఈ చట్టాలు అమలులోకి వస్తే రైతులు నిర్వహించుకుంటున్న సహకార, పాడి సంఘాలు, మార్కెట్ కమిటీలు రైతుల చేతులలో ఉండవు. ఇప్పుడు అమలులో ఉన్న మార్కెటింగ్ శాఖ గోడౌన్లు, సి.డబ్ల్యు.సి గోడౌన్లు, ఎఫ్.సి.ఐ గోడౌన్లు కార్పొరేట్ కంపెనీల వశం అవుతాయి. ఇవి గతంలో రద్దు చేసిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలకన్నా ప్రమాదకరమైనవిగా ఎ.ఐ.కె.ఎస్, సంయుక్త కిసాన్ మోర్చా నిర్ధారించాయి. ఈ స్థితిలో సి2 ప్లస్ 50 ఫార్ములా ప్రకారం మద్దతు ధరల అమలు గ్యారంటీ చట్టం కోసం, ఒకసారి రైతుల రుణాల రద్దు కోసం పోరాటాన్ని పున:ప్రారంభించాలని ఎస్.కె.ఎమ్ పిలుపు ఇచ్చింది.



స్వాతంత్ర్యానంతరం అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం, పంటల మద్దతు ధరల చట్టం కోసం, ఆహార భద్రత చట్టం కోసం పోరాటాలు సాగాయి. రైతుల వద్ద పంటలు సేకరించే మార్కెట్ల చట్టాలు వచ్చాయి. పంజాబ్‌లో భాక్రానంగల్ ప్రాజెక్టు కోసం, ఆంధ్రాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కోసం, రాయలసీమ కరువు సమస్యల పైన పలు పోరాటాలు సాగాయి. బంజరు భూముల ఉద్యమాలు జరిగాయి. ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు వ్యతిరేకంగా పోరాటాలు సాగాయి. ఈ కాలంలో అధికారంలోకి వచ్చిన పార్టీలు వారి వారి స్వతంత్ర సంఘాలు స్థాపించుకున్నాయి. ఎ.ఐ.కె.ఎస్ తన ప్రస్థానాన్ని ముందుకు కొనసాగించింది.

1991 దశకంలో వచ్చిన సరళీకరణ విధానాలు వ్యవసాయ రంగాన్ని ఒక కుదుపు కుదిపాయి. ఎ.ఐ.కె.ఎస్ ఒంటరిగా సరళీకరణ విధానాలను, డంకెల్ డ్రాఫ్ట్‌ను ప్రతిఘటించింది. సరళీకరణ విధానాలు ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. రైతుల ఆత్మహత్యలు ప్రారంభమైనాయి. పాలక వర్గాలు రైతుల ఆత్మహత్యలను వక్రీకరించే ప్రయత్నం చేయగా, కిడ్నీలు అమ్ముకుంటున్న రైతుల దుస్థితిని ఎ.పి రైతు సంఘం వెలికి తీసింది. జస్టిస్ పి.ఎ. చౌదరి నాయకత్వాన ఏర్పడిన కమిషన్ అనేక విషయాలను బహిర్గతం చేయడంతో తప్పని స్థితిలో ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలను గుర్తించింది. క్రమంగా అన్ని సంఘాలు వివిధ రూపాలలో పోరాటాలు ప్రారంభించాయి.

అనంతరం డాక్టర్ ఎం.ఎస్ స్వామినాథన్ కమిషన్ ఏర్పరిచింది. స్వామినాథన్ కమిషన్ కూలంకుషంగా పరిశీలించి నేటి వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు సూచించారు. అందులో ప్రధానమైనది సి2 ప్లస్ 50 పంటల మద్దతు ధరల పథకం, పాలక పార్టీలు అమలుకు పూనుకోలేదు. 2013 భూసేకరణ పునరావాస చట్టం వచ్చింది.

అఖిల భారత కిసాన్ సభ సి2 ప్లస్ 50 చట్టం కోసం, రుణ విముక్తి కోసం అనేక రైతు సంఘాలను కలుపుకొని ఆలిండియా కిసాన్ సంఘర్ష్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పరిచింది. ఆ కమిటీలో 240 సంఘాలు చేరాయి. సి2 ప్లస్ 50 అమలు కోసం, రైతు రుణ విమోచన చట్టం కోసం పోరాటం ప్రారంభించాయి. సి2 ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని బిజెపి ప్రభుత్వం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానానికి భిన్నంగా వ్యవహరించింది. మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీల హస్తగతం చేయడానికిగాను అప్రజాస్వామికంగా మూడు వ్యవసాయ చట్టాలు తెచ్చింది.

మూడు వ్యవసాయ చట్టాలకు నిరసనగా 2020 నవంబరు 26న 'చలో ఢిల్లీ'కి పిలుపు ఇవ్వగా రైతాంగం పెద్ద ఎత్తున కదిలింది. ఎ.ఐ.కె.ఎస్ చొరవతో మొత్తం 540 సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎమ్)గా ఏర్పడ్డాయి.

పదమూడు మాసాల అనంతరం గత్యంతరం లేని స్థితిలో బి.జె.పి ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంది. ఢిల్లీ పరిసరాలలో జరిగే ఉద్యమాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలకు అన్ని జిల్లాలకు విస్తరించడంలోను ఉద్యమానికి కార్మికవర్గం ఇతర ప్రజాతంత్ర ఉద్యమాల మద్దతు కూడగట్టడంలో ఎ.ఐ.కె.ఎస్ ప్రధాన పాత్ర వహించింది.

ఉద్యమ విరమణ సందర్భంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చింది. ఆ హామీని అమలుపరచకుండా రైతాంగాన్ని మోసగించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలన్నిటిలో అదాని, అంబానీల ఉద్యోగులను సలహాదారులుగా నియమించింది. నేడు ఆ హామీకి భిన్నంగా మరలా మూడు చట్టాలను రూపొందించింది.

రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో ఉన్న సహకార వ్యవస్థను కేంద్రం అధీనంలోకి తీసుకుంది. సహకార పరపతి సంఘాలను పాడి సహకార సంఘాలను మత్స్య సహకార సంఘాలను ఏకం చేసి, వాటిని కార్పొరేట్ అనుకూల సంపన్న వర్గాలకు అప్పజెప్పే విధంగా చట్టాలు మార్పు చేసింది. ఇప్పుడున్న మార్కెట్ చట్టాలను నిర్వీర్యం చేస్తూ కంపెనీల ప్రయోజనాలకు అనుకూలంగా 12 సవరణలు చేసింది. మద్దతు ధరలు, మార్కెట్లలో ప్రభుత్వ సంస్థల జోక్యం లేకుండా చేసింది. బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధికి సున్నా చుట్టింది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పేరుతో 11 కోట్ల రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల అజమాయిషీలోకి నెట్టే చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టాలు అమలులోకి వస్తే రైతులు నిర్వహించుకుంటున్న సహకార, పాడి సంఘాలు, మార్కెట్ కమిటీలు రైతుల చేతులలో ఉండవు. ఇప్పుడు అమలులో ఉన్న మార్కెటింగ్ శాఖ గోడౌన్లు, సిడబ్ల్యుసి గోడౌన్లు, ఎఫ్‌సిఐ గోడౌన్లు కార్పొరేట్ కంపెనీల వశం అవుతాయి. ఇవి గతంలో రద్దు చేసిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలకన్నా ప్రమాదకరమైనవిగా ఎ.ఐ.కె.ఎస్, సంయుక్త కిసాన్ మోర్చా నిర్ధారించాయి.

ఈ స్థితిలో సి2 ప్లస్ 50 ఫార్ములా ప్రకారం మద్దతు ధరల అమలు గ్యారంటీ చట్టం కోసం, ఒకసారి రైతుల రుణాల రద్దు కోసం పోరాటాన్ని పున:ప్రారంభించాలని ఎస్.కె.ఎమ్ పిలుపు ఇచ్చింది. పోరాటానికి రూపకల్పన చేయడం కోసం ఏప్రిల్ 21న ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా జనరల్ బాడీ జరగనుంది. ఎ.ఐ.కె.ఎస్ ఆవిర్భవించిన రోజైన ఏప్రిల్ 11న గ్రామ గ్రామాన పతాకావిష్కరణ చేయాలని, రైతులతో సమావేశాలు నిర్వహించాలని, రాబోయే పోరాటానికి రైతాంగాన్ని సన్నద్ధం చేయాలని ఎ.ఐ.కె.ఎస్ పిలుపునిచ్చింది.

/ వ్యాసకర్త సీనియర్ రైతు నాయకులు /

భావ ప్రకటన స్వేచ్ఛకు ద్వారాలు తెరిచిన 'సుప్రీం'

వ్యాఖ్య



డా॥ కత్తి పద్మారావు

నిజానికి భారత అత్యున్నత న్యాయస్థానం భావ ప్రకటన స్వేచ్ఛకు ద్వారాలు తెరవడంపై సర్వత్రా హర్షధ్వానాలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఒక్కసారిగా భారతీయ పౌర సమాజం ఊపిరి పీల్చుకుంది. ఈ క్రమంలో పౌరుల భావప్రకటన స్వేచ్ఛ అత్యంత కీలకమైనదని, వ్యక్తులు లేదా వ్యక్తుల సమూహం తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయటం నాగరిక సమాజంలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల తేల్చిచెప్పింది. 'ఆ అభిప్రాయాలతో లేదా ఆలోచనలతో విభేదించవచ్చు. ఆ అభిప్రాయాలకు భిన్నంగా మరో అభిప్రాయాన్ని ప్రకటించటం ద్వారా దాన్ని ఎదుర్కోనాలి తప్ప అణచివేస్తామనడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించటమే అవుతుంది' అని తెలియజేసింది. ఇన్‌స్టాలో, ఎక్స్‌లో గుజరాత్ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ గర్హి పెట్టిన కవిత వల్ల సమాజంలో విద్వేషాలు రగులుతాయని ఆరోపిస్తూ అక్కడి పోలీసులు కేసు పెట్టారు. దీన్ని తప్పుబడుతూ, కేసును కొట్టివేస్తూ ఇచ్చిన ఈ తీర్పు అనేక విధాల ఎన్నదగినది. రాజ్యాంగ విలువల పట్లా, పౌరుల హక్కుల పట్లా వీసమెత్తు గౌరవం లేని అనైతిక పాలకులు ఇష్టారాజ్యంగా రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెట్టడం ఈమధ్య బాగా ముదిరింది. నిజానికి గుజరాత్ పోలీసులకు అభ్యంతరకరంగా కనిపించిన ఈ కవితలో దేశ ద్రోహానికి సంబంధించిన అంశాలు ఏమీ లేవు. అది ఒక విశ్వజనీనమైన భావనే. ఆ కవితను ఒకసారి మనం చూస్తే 'ఓ రక్త పిపాసులారా వినండి...' అంటూ మొదలయ్యే ఆ కవితలో అలాంటి వారికి ప్రేమను పంచుతామన్న సందేశమే ఉంటుంది. అన్యాయానికి ఒడిగట్టినా దాన్ని న్యాయంతోనే ఎదుర్కొంటాం అంటుంది. ఇందులో పోలీసులకు ఏది అభ్యంతరమనిపించిందో గానీ వెనకా ముందూ చూడకుండా కేసు పెట్టారు. విచారణ సందర్భంలో గుజరాత్ ప్రభుత్వం తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 'ఒక్కొక్కరు దీన్ని ఒక్కోవిధంగా విశ్లేషించుకుంటారు' అని పోలీసులను సమర్థిస్తుండగా సృజనాత్మకతను గౌరవించే సంస్కృతి లేకపోవటాన్ని ధర్మాసనం ఎత్తిచూపింది.

నిజానికి భావ ప్రకటన స్వేచ్ఛ మీద భారత రాజ్యాంగం ఏమంటుందో చూద్దాం. అధికరణం 19:భావ ప్రకటనా స్వేచ్ఛ మొదలైనవి: 1) పౌరులందరూ ఈ క్రింద ఉదహరింపబడిన హక్కులను కలిగి ఉంటారు: ఎ)భావ ప్రకటనా స్వేచ్ఛ, బి) ఆయుధములు లేకుండా శాంతియుతముగా సమావేశము జరుపుకొను స్వేచ్ఛ, సి) అసోసియేషన్లు లేక యూనియన్లు లేక సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొను హక్కు (97వ రాజ్యాంగ సవరణద్వారా 'సహకార సంఘాలు' అనే పదం చేర్చబడింది. 13-2-2012), డి) భారతదేశమంతా స్వేచ్ఛగా సంచరించే హక్కు, ఇ) భారత భూభాగంలో ఏ ప్రాంతంలో అయినా నివసించే హక్కు, ఎఫ్) (ఆస్తి హక్కుకు సంబంధించిన ఈ క్లాజు 1978లో, 44వ రాజ్యాంగ సవరణ సందర్భంగా తొలగించబడినది), జి) ఏవిధమైన వృత్తినైనా, వ్యాపారాన్ని అయినా చేసుకునే హక్కు. 2) క్లాజు (1)లోని సబ్ క్లాజు (ఎ)లో ఏమి చెప్పబడినప్పటికి, భారతదేశ సమగ్రత, సార్వభౌమాధికార పరిరక్షణ దృష్ట్యాగాని లేక దేశ భద్రత దృష్ట్యాగాని లేక విదేశాలతో సంబంధాల దృష్ట్యాగాని లేక శాంతి భద్రతలు, నైతిక విలువలు, సభ్యత, కోర్టు ధిక్కారం, పరువు నష్టం, నేరములు చేయుటకు ప్రోత్సహించుట మొదలైన వాటిని నియంత్రించే లక్ష్యంతోగాని, క్లాజు (ఎ)లో ఉదహరింపబడింది.

భావ ప్రకటన స్వేచ్ఛ చట్టాన్ని ఫ్రెంచ్ రెవల్యూషన్ స్ఫూర్తితో అంబేద్కర్ తీసుకొచ్చారు. ఆయన తన జీవితం మొత్తం భావ ప్రకటన స్వేచ్ఛ కోసమే పోరాడారు. కార్ల్‌మార్క్స్, బెర్ట్రాండ్ రసెల్ వంటి మేధావులంతా భావప్రకటన స్వేచ్ఛ కోసం పోరాడినవారే. నిజానికి భారత రాజ్యాంగం శాంతియుతంగా సభలు, సమావేశాలు పెట్టుకునే హక్కును కూడా ప్రభుత్వాలు నిరోధించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కవిత్వం, ఉపన్యాసం, రచన, విశ్లేషణ, జీవించే హక్కు ఇవన్నీ ప్రపంచ జీవన వ్యవస్థల విస్తృతికి ఉపకరిస్తాయి. భావ ప్రకటన స్వేచ్ఛతో అధికరణం (29) సాంస్కృతిక విద్యా హక్కులు కూడా ముడిపడి ఉన్నాయి. ఇటీవల సాంస్కృతిక విప్లవానికి అవరోధం కలిగించే అనేక పోకడలు దేశంలో కన్పిస్తున్నాయి. మొత్తం లౌకికవాదం ప్రజాస్వామ్యవాదం, సామ్యవాదం, భావప్రకటన స్వేచ్ఛ మీద ఆధారపడి ఉన్నాయి. మొత్తం భారత రాజ్యాంగమే భావ ప్రకటన స్వేచ్ఛ మీద ఆధారపడి ఉంది. దేశంలో భారత రాజ్యాంగం ప్రతిఫలించాలంటే భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

ఆంధ్ర సాహిత్యంలో వేమన, జాషువా, శ్రీశ్రీ, చెరబండరాజు, దళిత కవులు, స్త్రీవాద కవులు, హేతువాద కవులే కాక...ఈనాడు ఆధునిక యుగంలో సైతం భావ ప్రకటన స్వేచ్ఛతోనే కవులు తమ రచనలు చేస్తున్నారు. ఈ తీర్పు వీరందరికి కూడ ఉత్సాహశక్తిగా నిలుస్తుంది. అయితే అంబేద్కర్, మార్క్స్ చెప్పినట్టు భావ ప్రకటన స్వేచ్ఛ కోసం దేశంలోను, ప్రపంచంలోను నిరంతరం పోరాటం జరగాల్సిందే. ఆ పోరాటంలో అందరం భాగస్వాములం అవుదాం.

/ వ్యాసకర్త సెల్ : 9849741695 /

'గ్రోక్'తో బిజెపి బెంబేలు

విశ్లేషణ



టి.నాగరాజు

రాజకీయ ప్రశ్నలకు 'గ్రోక్' ఇస్తున్న సమాధానాలు సంచలనం రేపాయి. ముఖ్యంగా ప్రధాని మోడీ, బిజెపి నేతల మీద అడుగుతున్న ప్రశ్నలకు 'గ్రోక్' ఇస్తున్న సమాధానాలతో బిజెపికి నిద్ర పట్టడం లేదు. మోడీ ప్రధాని అయ్యాక నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌ల గురించి విశ్లేషించాలని కోరగా...మోడీ మీడియా ముందుకు రావడం లేదని, మాట్లాడే పనిని అమిత్ షా కు అప్పగించారంటూ సమాధానం ఇచ్చింది. అంతేకాదు, మోడీ ఇచ్చే ఇంటర్వ్యూలన్నీ స్క్రిప్టెడ్ (ముందే సిద్ధం చేసుకున్న ప్రశ్నలు, జవాబులు)గా అనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. దీంతో గ్రోక్ చుట్టూ రాజకీయాలు తిరగడం మొదలయ్యాయి.



అబద్ధాలతో, డిజిటల్ రాతలతో, ఫేక్ వీడియోలతో, దేశ ప్రజల కళ్లకు గంతలు కట్టిన బిజెపి నిజ స్వరూపాన్ని యావత్తు జాతి ముందు గ్రోక్ ఆవిష్కృతం చేస్తున్నది. ఇంత కాలం అబద్ధాలనే నిజాలంటూ ఏమార్చిన బిజెపి, దాని ఐటీ సెల్, వారి అసత్య ప్రచారాలను ఇది ఒక ఆట ఆడుకుంటున్నది. గ్రోక్ సంస్థకు అధిపతి ఎలన్ మస్క్ బడా సంపన్నుడు, అమెరికా పాలక వర్గాల ప్రతినిధి. మోడీ, ఆరెస్సెస్ లకు వ్యతిరేకంగా గ్రోక్ చెప్పకూడదని ఆరెస్సెస్, మోడీల కోరిక. కానీ సమాచారం అందించే వారి కోరికను టెక్నాలజీ మన్నించడం లేదు. ఢిల్లీలోని అశోకా రోడ్‌లో ఉన్న కేంద్ర బిజెపి ఐటీ విభాగాన్ని చూస్తే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ మాదిరి అనిపిస్తుంది. దీనికి నేషనల్ డిజిటల్ ఆపరేషన్ సెంటర్ అని పేరు. అక్కడ గుంపులు గుంపులుగా టెక్కీలుగా పిలవబడే ఉద్యోగులు కనబడతారు. వీరంతా చిన్న చిన్న ఇంజినీరింగ్ కాలేజీల్లో డిగ్రీలు పూర్తి చేసిన నవ యువతీ, యువకులు.

వీరిని ఉపయోగించి బిజెపి గడిచిన దశాబ్ద కాలంగా ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్ (ఎక్స్)ను సమర్థవంతంగా ఉపయోగించి, తన సోషల్ మీడియా టీమ్ ద్వారా అసత్య ప్రచారాన్ని ముమ్మరం చేసింది. దీని కోసం ప్రత్యేకంగా "టెక్ ఫాగ్" యాప్‌లను తయారు చేసి, ఫేక్ ఖాతాలను సృష్టించి, సోషల్ మీడియాలో నకిలీ ట్రెండింగ్, ఆటో ట్వీట్లు, ఆటో రిప్లేలతో ట్రోలింగ్ పెంచి దాడి చేస్తున్నది.

సోషల్ మీడియాను ఎలా వాడుకోవాలో బిజెపికి అసలైన శిక్షణను ఇచ్చింది తమిళనాడుకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకులు. మొదట్లో ఈ టెక్నాలజీని అందిపుచ్చుకోవటానికి ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు మొండికేశాయి. కానీ, దీంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని నేతలు నచ్చచెప్పాల్సి వచ్చింది! బిజెపి సోషల్ మీడియా కార్యకలాపాలన్నీ ఇప్పుడు బెంగళూరు నుంచి కొనసాగుతున్నాయి. 1947లో, 1948లో (గాంధీజీ హత్య కారణంగా), 1975లో, 1977లో, 1992లో ఆర్‌ఎస్‌ఎస్ నిషేధానికి గురైంది. అభద్రత, చట్టపరమైన శిక్షలకు భయపడిన కారణంగా ఆర్‌ఎస్‌ఎస్ తన సంస్థాగత నిర్మాణాన్ని రహస్యంగా శాఖల ప్రాతిపదికన ఏర్పరచుకుంది. కాబట్టి, సోషల్ మీడియాలో కూడా ఇదే పని విధానాన్ని బాగా ఆరితేరినతనంతో అమలు చేస్తున్నది.

వాస్తవానికి 2014 లోక్‌సభలో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశ్యంతో 2012 గుజరాత్ ఎన్నికల్లో పని చేసిన రాబిన్ శర్మను పొలిటికల్ స్ట్రాటజీ టీమ్‌గా బిజెపి నియమించి సోషల్ మీడియాలో ఇన్నోవేటివ్ మార్కెటింగ్, అడ్వర్టైజింగ్ క్యాంపెయిన్‌లు చేసింది. అబద్ధాలను వాస్తవాలుగా ప్రచారం చేసేందుకు అనేక రకాల మ్యాడ్యూళ్లను సిద్ధం చేసి తర్వాత వాటిని సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో ప్రచారం కల్పించింది. వందల మంది ఐఐటిలలో చదివిన వారితో బిజెపి ఐటి సెల్ ఏర్పాటు చేసింది.

ఆర్‌ఎస్‌ఎస్ ఈ క్రమంలోనే...బిజెపి, ప్రధానిని ఎవరైనా విమర్శిస్తే దాడి చేయడం, పథకాలు, ప్రభుత్వ నిర్ణయాల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నట్లు ప్రకటించటం, చరిత్ర అంశాలను వక్రీకరించి తమకు అనుకూలంగా మార్చుకోవటం చేసింది. ఈ సందర్భంగా ఎలన్ మస్క్ ట్విట్టర్‌ను తన చేతికి తీసుకున్న తర్వాత 'ఎక్స్'ను నియంత్రించాలనే బిజెపి యత్నాలకు ఆ సంస్థ ఏ మాత్రం భయపడడం లేదు. గతంలో ఢిల్లీ రైతుల ఉద్యమం సమయంలో ట్విట్టర్, ఫేస్‌బుక్‌లపై ఆంక్షలు విధించింది. ఇప్పుడు 'గ్రోక్'పై ఆంక్షలు విధించాలని చూస్తే 'గ్రోక్' బిజెపి నిజ స్వరూపం బయట పెట్టింది. దీంతో బిజెపి శ్రేణులు గ్రోక్ వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. రాజకీయ ప్రశ్నలకు 'గ్రోక్' ఇస్తున్న సమాధానాలు సంచలనం రేపాయి. ముఖ్యంగా ప్రధాని మోడీ, బిజెపి నేతల మీద అడుగుతున్న ప్రశ్నలకు 'గ్రోక్' ఇస్తున్న సమాధానాలతో బిజెపికి నిద్ర పట్టడం లేదు. మోడీ ప్రధాని అయ్యాక నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌ల గురించి విశ్లేషించాలని కోరగా...మోడీ మీడియా ముందుకు రావడం లేదని, మాట్లాడే పనిని అమిత్ షా కు అప్పగించారంటూ సమాధానం ఇచ్చింది. అంతేకాదు మోడీ ఇచ్చే ఇంటర్వ్యూలన్నీ స్క్రిప్టెడ్ (ముందే సిద్ధం చేసుకున్న ప్రశ్నలు, జవాబులు)గా అనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. దీంతో గ్రోక్ చుట్టూ రాజకీయాలు తిరగడం మొదలయ్యాయి. దేశంలో అత్యధికంగా నకిలీ వార్తలు ఎవరు ప్రచారం చేస్తున్నారని ఒకరు ప్రశ్నించగా.. దేశంలోని అనేక ప్రముఖ మీడియా సంస్థల పేర్లను, వాటిల్లోని ముఖ్య అధికారుల పేర్లను చెప్పింది. ప్రధాన మీడియా సంస్థలపై బిజెపి ప్రభావం గురించి అడగగా...మోడీతో సన్నిహితంగా ఉన్న అదాని, అంబానీ వంటి కార్పొరేట్ పెద్దలు పెద్దపెద్ద మీడియా సంస్థలకు అధిపతులుగా ఉన్నారని గ్రోక్ సమాధానం ఇస్తున్నది.

అయినా కేంద్రం చర్యలపై 'గ్రోక్' ఏ మాత్రం భయపడటం లేదు. 'గ్రోక్' సంస్థ 'ఎక్స్' కర్ణాటక హైకోర్టులో కేంద్రానికి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేసు దాఖలు చేసింది. కేంద్రం ఐటి చట్టంలోని సెక్షన్ 79(3)(బి)ని ఉపయోగించి గ్రోక్‌లో ఉన్న కంటెంట్ తొలగించాలని ఆదేశించిందని తాము వేసిన కోర్టు దావాలో తెలిపారు. ఇలా తమకు ఆదేశాలు ఇవ్వడం గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆన్‌లైన్ భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని, మా హక్కును కేంద్రం హరించడమేనని 'గ్రోక్' వాదించింది. కేంద్రం ఈ సెక్షన్‌ని ఉపయోగించుకొని కంటెంట్ ఏది ఉండాలో ఏది ఉండకూడదో నిర్ణయిస్తూ సమాచారాన్ని తొలగించాలని బ్లాక్ మెయిల్ చేస్తున్నదని గ్రోక్ వాదిస్తుంది. 'గ్రోక్' చేస్తున్న ఈ వాదనను నెటిజన్లు స్వాగతిస్తున్నారు. గ్రోక్ సూటిగా, నిర్భయంగా సమాధానాలు ఇస్తుందని ప్రశంసిస్తున్నారు. కానీ బిజెపి ఈ ప్రభావాన్ని నిలువరించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నది. గ్రోక్‌కు వ్యతిరేకంగా తమిళనాడులో ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఒకవైపు గ్రోక్ ఇలా బిజెపిపై ఎదురు దాడి చేస్తుంటే మరోవైపు ఇతర ఏఐ టూల్స్ కూడా దానికి అండగా ఉన్నాయి. బిజెపి ఏ వార్త ప్రచారం చేసినా నిజం తెలుసుకోవటానికి గ్రోక్‌తో పాటు ఇతర 'ఎఐ టూల్స్, చాట్ జిపిటి, డీప్ సీక్, జెమినీ'లను నెటిజన్లు ఆశ్రయిస్తున్నారు. బిజెపి తనకు అనుకూల వార్తలను ప్రచారం చేసుకోవడంతో పాటు, వ్యతిరేక కథనాలను, వార్తలను తిప్పి కొట్టడానికి సంవత్సరానికి ఏకంగా 140 మిలియన్ డాలర్లను ఖర్చు చేస్తున్నదని సమాధానం ఇచ్చింది. ముఖ్యంగా 2014 నుంచి విమర్శకుల గొంతులను నొకుతున్నట్టు తెలిపింది. మత విద్వేషాలను వ్యాప్తి చేసినందుకు ఏ రాజకీయ నాయకులను అరెస్టు చేస్తారని ఓ నెటిజన్ అడగగా...ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, యు.పి సీఎం యోగి ఆదిత్యనాథ్, బిజెపి నేత గిరిరాజ్ సింగ్ వంటి వారు మత విద్వేషాలను ఎక్కువగా ప్రచారం చేస్తున్నారని గ్రోక్ పేరొన్నది. దీంతో గ్రోక్ సమాధానాలపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. గతంలో ఏఐ చాట్ బాట్ వాడే భాషపై కొంత నియంత్రణ ఉండేదని, గ్రోక్ ఆ హద్దులను చెరిపేసిందని అంటున్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత ఘాటు వ్యాఖ్యలు చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. గ్రోక్ వ్యతిరేకంగా బిజెపి ప్రచారాలను, ఆందోళనలను చేస్తున్నా... 'ఎ.ఐ' ముందు ఎలా నిలబడాలనేది ఆ పార్టీ ముందు పెద్ద ప్రశ్నగా నిలబడింది.

/వ్యాసకర్త ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, సెల్: 9490098292 /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com


హత్య సినిమా డైరెక్టర్, నిర్మాతకు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

హత్య సినిమా డైరెక్టర్, నిర్మాతకు బుధవారం హైకోర్టులో ఉపశమనం లభించింది. పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు జారీ చేసింది. హత్య సినిమా డైరెక్టర్, రైటర్ శ్రీవిద్య, నిర్మాత ప్రశాంత్‌రెడ్డిపై తదుపరి చర్యలను నిలుపుదల చేసింది. సినిమా విడుదలకు సెన్సార్ బోర్డు సర్టిఫికేషన్ ఇచ్చిందని న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గుర్తు చేశారు. ఫిర్యాదుదారుడు సునీల్ యాదవ్‌కు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను జూన్ 30కు వాయిదా వేశారు. తన తల్లి మనోభావాలను దెబ్బతీసేవిధమే కాకుండా తన వ్యక్తిగత జీవితాన్ని దెబ్బతీసేలా సినిమా చిత్రీకరణ చేశారంటూ వివేకా హత్య కేసు నిందితుడు సునీల్ యాదవ్ ఫిర్యాదు మేరకు గత నెల 22న పులివెందుల పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. దీనిని కొట్టివేయాలని కోరుతూ సినిమా డైరెక్టర్, రైటర్ శ్రీవిద్య, నిర్మాత ప్రశాంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో ఉపశమనం లభించింది.

వర్షపాతం సాధారణమే

- సీజన్ రెండో భాగం మెరుగు
- బలహీనంగా, స్వల్పకాలికంగా లా నిన
- దక్షిణ, పశ్చిమ భారతంలో తగినంత వర్షాలు
- ప్రయివేటు వాతావరణ ఏజెన్సీ స్కైమెట్ అంచనా



న్యూఢిల్లీ : భారత్‌లో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సాధారణ వర్షపాతమే నమోదవుతుందని ప్రయివేటు వాతావరణ ఏజెన్సీ స్కైమెట్ అంచనా వేసింది. స్కైమెట్ అంచనా ప్రకారం.. ఈ సీజన్‌లో వర్షపాతం దీర్ఘకాల సగటు 868.6 మిల్లీమీటర్ల కంటే నూరు శాతం అధికంగా నమోదు కానున్నది. దీర్ఘకాలిక సగటులో నాలుగుశాతం వర్షపాతం సాధారణంగా పరిగణించబడుతుంది. "ఈ సీజన్‌లో లా నిన బలహీనంగా, స్వల్పకాలికంగా ఉన్నది. లా నినా కీలక సంకేతాలు ఇప్పుడు మసకబారటం ప్రారంభించాయి. సాధారణంగా రుతుపవనాలను ప్రభావితం చేసే ఎల్‌నినో సంభవించే అవకాశం తోసిపుచ్చబడింది" అని స్కైమెట్ మేనేజింగ్ డైరెక్టర్ జతిన్ సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సీజన్ రెండో భాగం.. మొదటి భాగం కంటే కంటే మెరుగ్గా ఉంటుందని భావిస్తున్నట్టు వివరించారు. లా నినా సాధారణంగా పెరిగిన వర్షపాతంతో ముడిపడి ఉంటుంది. ఎల్ నినో ఇందుకు విరుద్ధంగా ఉంటుంది.

దక్షిణ, పశ్చిమ భారతంలో తగినంత వర్షాలు

పశ్చిమ, దక్షిణ భారతంలో కావాల్సినంత చక్కటి వర్షాలు కురుస్తాయని స్కైమెట్ అంచనా వేసింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో 'తగినంత' వర్షపాతం నమోదు కానున్నది. పశ్చిమ కనుమల వెంబడి అత్యధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నది. కేరళ, తీరప్రాంత కర్నాటక, గోవాలలో అధిక వర్షాలు నమోదయ్యే పరిస్థితులున్నాయి. ఇక వాయువ్య ప్రాంతం, ఉత్తర భారతంలోని కొండప్రాంత రాష్ట్రాలలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

జూన్‌లో వానలు తక్కువే

వర్షాకాలం మొదటి నెల అయిన జూన్‌లో సాధారణం కంటే నాలుగుశాతం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నది. ఇక అత్యధిక వర్షపాతం నమోదయ్యే నెలైన జులైలో రెండు శాతం, ఆగస్టులో [illegible] శాతం ఎక్కువగా వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్‌లో నాలుగు శాతం అధికంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఇక వాతావరణ శాఖ (ఐఎండీ) దేశంలో వర్షాభావ పరిస్థితుల గురించి తన అంచనాలను వచ్చేవారం తర్వాత విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024లో, భారత్‌లో జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సాధారణం కంటే 8 శాతం ఎక్కువగా వర్షాలు కురిశాయి.

యూనివర్సిటీలపై ఆగని ట్రంప్ ప్రతీకార చర్యలు

- నిన్న ప్రిన్స్‌టన్.. నేడు కార్నెల్, నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయాలు
- 1 బిలియన్ డాలర్లకు పైగా నిధులను స్తంభింపజేసిన రిపబ్లికన్ గవర్నమెంట్
- పౌర హక్కుల ఉల్లంఘనల విషయంలో రెండు సంస్థలపై దర్యాప్తు

వాషింగ్టన్ : అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం అక్కడి యూనివర్సిటీలకు నిధులను నిలిపివేసే పరంపరను కొనసాగిస్తున్నది. ప్రతీకార చర్యలకు దిగుతోంది. డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కార్నెల్ విశ్వవిద్యాలయానికి 1 బిలియన్ డాలర్లు, నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీకి 790 మిలియన్ డాలర్లకు పైగా నిధులను స్తంభింపజేసింది. పౌర హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి ట్రంప్ యంత్రాంగం రెండు సంస్థలపై దర్యాప్తు చేస్తున్నది. ఈ నేపథ్యంలో నిధులను నిలిపివేసింది. పేరు వెల్లడించటానికి ఇష్టపడని యూఎస్ అధికారి ఒకరు ఈ విషయాన్ని తెలిపారు. "నిలిపివేయబడుతున్న నిధులలో ఎక్కువగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, రక్షణ సమాఖ్య విభాగాలకు సంబంధించిన గ్రాంట్లు, కాంట్రాక్ట్‌లు ఉంటాయి" అని సదరు అధికారి వివరించారు.

పాలస్తీనా అనుకూల క్యాంపస్ నిరసనలు, వైవిధ్యం, సమానత్వం, ఇన్‌క్లూషన్ ప్రోగ్రామ్స్, ట్రాన్స్‌జెండర్ పాలసీలపై ఆందోళనల కారణంగా ట్రంప్ యంత్రాంగం విశ్వవిద్యాలయాల నుంచి ఫెడరల్ ఫండ్స్ నిలిపివేస్తామని బెదిరించింది. గతనెలలో, కార్నెల్, నార్త్‌వెస్ట్రన్‌తో సహా 60 విశ్వవిద్యాలయాలకు ఒక లేఖను పంపింది. పాఠశాలలు తాను వర్ణించిన యాంటీసెమిటిజం (యూదువ్యతిరేకత) ను పరిష్కరించటంలో విఫలమైనట్టు సమీక్షలో తేలితే అమలు చర్యలు ఉంటాయని హెచ్చరించింది. మొత్తం నిధుల స్తంభన, విలువకు సంబంధించి అధికారిక నోటిఫికేషన్ అందనప్పటికీ.. రక్షణ, ఆరోగ్యం, సైబర్ భద్రతలో పరిశోధనలకు సంబంధించి రక్షణ శాఖ నుంచి పని నిలిపివేత ఉత్తర్వులు అందాయని కార్నెల్ విశ్వవిద్యాలయం పేర్కొన్నది. ప్రభుత్వం నుంచి మరిన్ని వివరాలు కోరుతున్నట్టు తెలిపింది. నిధుల స్తంభనపై మీడియా నివేదికలను నార్త్‌వెస్ట్రన్ విశ్వవిద్యాలయం అంగీకరించింది. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ రాలేదని వివరించింది. కొనసాగుతున్న దర్యాప్తునకు సహకరిస్తున్నట్టు విశ్వవిద్యాలయం వివరించింది.

ట్రంప్ తీరుపై మానవ హక్కుల కార్యకర్తల ఆందోళన

విశ్వవిద్యాలయాలపై ట్రంప్ సర్కారు కఠిన చర్యలు తీసుకోవటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ చర్యకు స్పందనగా మానవ హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులు వాక్ స్వాతంత్ర్యం, విద్యా స్వేచ్ఛపై ఆందోళన వ్యక్తం చేశారు. గతవారం, అమెరికా ప్రభుత్వం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి సంబంధించి 9 బిలియన్ డాలర్ల ఫెడరల్ గ్రాంట్లు, కాంట్రాక్టులను సమీక్షిస్తున్నట్టు ప్రకటించింది. సమాఖ్య నిధులను పొందటానికి విశ్వవిద్యాలయం తప్పనిసరిగా పాటించాల్సిన నిర్దిష్ట షరతులను విధించింది. అలాగే, ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం ప్రభుత్వం తన డజన్ల కొద్దీ పరిశోధన గ్రాంట్లను నిలిపివేసిందని వెల్లడించినట్టు రాయిటర్స్ ఉటంకించింది. గతనెలలో ట్రంప్ సర్కారు కొలంబియా విశ్వవిద్యాలయానికి 400 మిలియన్ డాలర్ల నిధులను రద్దు చేసింది.

ఈ క్యాంపస్ గతేడాది పాలస్తీనా అనుకూల నిరసనలకు కేంద్రంగా ఉండటం గమనార్హం. ఇటీవల వివిధ క్యాంపస్‌ల నుంచి అనేక మంది విదేశీ విద్యార్థుల నిరసనకారులను ఫెడరల్ ఏజెంట్లు అదుపులోకి తీసుకున్నారు. వారిని బహిష్కరించటానికి చర్యలు తీసుకుంటున్నారు. నిరసనల్లో పాల్గొన్న అనేక మంది విదేశీ విద్యార్థుల వీసాలను కూడా ప్రభుత్వం రద్దు చేసింది. క్రీడలలో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనే అంశానికి సంబంధించిన విధానాల కారణంగా ట్రంప్ యంత్రాంగం పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయానికి 175 మిలియన్ డాలర్ల నిధులను నిలిపివేసింది.

పట్టణ ఎస్‌హెచ్‌జిలకు రూ.16 వేల కోట్ల రుణం ఇచ్చాం

- మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గడిచిన తొమ్మిది నెలల్లో పట్టణ స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జి) రూ.16 వేల కోట్ల రుణాలు అందించామని మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ అన్నారు. లీప్ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిలో నిర్వహించిన వర్క్‌షాపులో బుధవారం ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల్లోని 7 లక్షల మంది స్వయం ఉపాధి పొందుతున్నారని, వీరిలో అనేక మంది పచ్చళ్ళు, పేపర్ ప్లేట్స్, పూజా సామగ్రి, సబ్బులు వంటి వస్తువులు తయారు చేస్తున్నట్లు చెప్పారు. వీరికి బ్రాండ్, మార్కెటింగ్‌లో శిక్షణ ఇస్తే మరింత ముందుకు వెళతారని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల సమగ్ర సమాచారాన్ని యాప్‌లో నమోదు చేశామన్నారు. 2.74 లక్షల సంఘాలు, 28.74 లక్షల సభ్యుల వివరాలు ఈ యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 30 వేల మంది మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడం, ఇప్పటికే వ్యాపారాలు చేస్తున్న 10 వేలమందికి శిక్షణ ఇచ్చి ఉత్తమ వ్యాపారవేత్తలుగా మార్చడం, 20 వేల మంది మహిళలను కొత్త వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చేయాలని ఆయన ఎస్‌ఎంఇ ఫోరం ప్రతినిదులను కోరారు.

16 మందితో ఆక్వా కల్చర్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా కల్చర్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసింది. అమెరికా టారిఫ్ సవాళ్ల అధిగమించే చర్యలపై ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. ఆక్వా ఎగుమతిదారులు, రైతులు, ఫీడ్ కంపెనీ ప్రతినిధులు, హేచరీలు, ఎంపెడాకు చెందిన మొత్తం 16 మంది సభ్యులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేస్తూ జిఒఆర్‌టి నెంబరు 128ని విడుదల చేసింది. ఆక్వా విషయంపై ఇప్పటికే సిఎం చంద్రబాబు, కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాసిన సంగతి పాఠకులకు విదితమే. అమెరికా సుంకాలతో నష్టపోతున్న ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని, సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులు మినహాయింపు పొందేలా యుఎస్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. సభ్యులుగా అధికారులతోపాటు ఎక్స్‌పోర్టర్స్‌ను కూడా నియమించారు. వెల్కమ్ ఫిషరీష్ కె ఆనంద్, సంధ్య మెరైన్ కె ఆనంద్‌కుమార్, నెక్కంటి సీ ఫుడ్స్ ఎన్ వెంకట్, కోస్టల్ సీ ఫుడ్స్ డి దిలీప్, కాకినాడ నుంచి కె రఘు (రైతు), కృష్ణా జిల్లా నుంచి వి కుమార్‌రాజు, నెల్లూరు జిల్లా నుంచి సిహెచ్ శ్రీకాంత్, పశ్చిమగోదావరి నుంచి ఎం రామరాజు, జివి సుబ్బరాజు, కృష్ణా జిల్లా ఫీడ్ కంపెనీ నుంచి ఎ సుబ్రహ్మణ్యం, అనకాపల్లి నుంచి ఎస్‌విఆర్ హేచరి పివిబి కుమార్, కాకినాడ సప్తగిరి హేచరి నుంచి ఎస్ఎస్ఎన్ రెడ్డి, ప్రభుత్వం నుంచి ఐఎఫ్ఎస్ అధికారి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సిఇఒ జి శేఖర్‌బాబు, ఫిషరీష్ అడిషనల్ డైరెక్టర్ సుదరాసి అంజలి, విజయవాడ ఎంపిఇడిఎ జాయింట్ డైరెక్టర్ వై విజయకుమార్, భీమవరం ఎక్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీ డిప్యూటీ డైరెక్టర్ అవినాష్‌ను ప్రభుత్వ ప్రతినిధులుగా నియమించారు. కమిటీ 5 రోజుల్లో స్టేక్‌హోల్డర్స్‌తో సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

ఐపిఎస్ అధికారి జాషువాకు లభించని ఊరట


ప్రజాశక్తి-అమరావతి

స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి రూ.కోట్లు వసూలు చేశారంటూ ఎసిబి తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ ఆ కేసులో ఎ-2గా ఉన్న ఐపిఎస్ అధికారి పి జాషువాకు బుధవారం హైకోర్టులో ఊరట లభించలేదు. ఎసిబి వాదనలు విన్న తర్వాతే మధ్యంతర ఉత్తర్వుల జారీ అంశంపై తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పింది. రాజకీయ నాయకులు చెప్పినట్లుగా ఎలా చేస్తారని, వాళ్ల చేతిలో కీలు బొమ్మలా ఎలా మారారని జస్టిస్ కె మల్లికార్జునరావు ప్రశ్నించారు. రెండు రాజకీయ పార్టీల మధ్య వైరం వల్ల కేసు నమోదైందని, ఇందులో తనను అన్యాయంగా ఇరికించారని, ఎసిబి కేసులో తదుపరి చర్యలు నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని పిటిషనర్ తరపున న్యాయవాది చేసిన అభ్యర్థనను తోసిపుచ్చారు. కేసు వివరాలు సమర్పించాలని ఎసిబిని ఆదేశించారు. విచారణను వారం రోజులకు వాయిదా వేశారు.

కారుమూరిపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఏలూరులో టిడిపి నేతలపై మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అనుచిత వ్యాఖ్యాలు చేయడాన్ని ఖండిస్తూ ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గుంటూరులో పలువురు టిడిపి నాయకులు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. టిడిపి నాయకులు కనపర్తి శ్రీనివాస్, మద్దిరాల మ్యాని, వేములపల్లి శ్రీరాం ప్రసాద్ మాట్లాడుతూ.. గుంటూరు అవతల వాళ్లను నరికేస్తాం అని కారుమూరి మాట్లాడడం సరికాదన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు తమను ఎంతో సంయమనంతో ఉండమని చెబుతున్నారని, వైసిపి నాయకులంతా దూకుడుగా రెచ్చిపోతున్నారని విమర్శించారు.



భారత ప్రభుత్వం
జౌళి మంత్రిత్వ శాఖ
డెవలప్‌మెంట్ కమీషనర్ (హస్తకళలు) వారి కార్యాలయం
హస్తకళల అవార్డులు-2024

హస్తకళల అభివృద్ధి కమిషనర్ (హస్తకళలు) వారి కార్యాలయం, హస్తకళల రంగంలో అత్యున్నత పురస్కారాలను, అత్యుత్తమ హస్తకళాకారులకు వారి చేతిపనుల వృద్ధికి మరియు అభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా ప్రదానం చేస్తుంది. 2024 హస్తకళల అవార్డులకు అర్హత కలిగిన హస్తకళాకారుల నుండి ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఈ క్రింది అవార్డు విభాగాలుగా ఆహ్వానించారు:

అవార్డు పేరు	కెటగిరి		అవార్డుల సంఖ్య
శిల్ప గురు అవార్డు	క్రాఫ్ట్ కెటగిరి		05
	ప్రత్యేకంగా మహిళల కోసం		01
	మొత్తం		06
జాతీయ అవార్డు			
1	క్రాఫ్ట్ కెటగిరి	లోహపు వస్తువులు	01
		చెరకు & వెదురు & అటవీ అధారిత ఉత్పత్తి	01
		రాతి వస్తువులు	01
		కుండలు, సిరామిక్స్ మరియు టెర్రకోట	01
		చిత్రలేఖనాలు	01
		నగలు మరియు విలువైన రత్నం	01
		కాగితపు యంత్ర క్రాఫ్ట్ మరియు పేపర్ క్రాఫ్ట్	01
		కళాత్మక వస్త్రాలు	01
		చేతితో తయారు చేసిన కార్పెట్/ రగ్/డ్యూరీలు	01
		బొమ్మలు మరియు బొమ్మవస్తువులు, తోలుబొమ్మ, ఆటలు మరియు గాలిపటాలు	01
		ఇతర క్రాఫ్ట్	01
		మహిళా కళాకారులు	01
		30 సంవత్సరాల కంటే తక్కువ వయస్సుగల యువ కళాకారులు	01
		దివ్యాంగ కళాకారులు	01
		అంతరించిపోతున్న చేతిపనులు	01
		గిరిజన కళాకారులు	01
2	డిజైన్ ఇన్నోవేషన్		01
3	స్టార్ట్-అప్ వెంచర్స్/ ప్రొడ్యూసర్ కంపెనీ		01
	మొత్తం		19

2) అర్హత ప్రమాణాలు, వయస్సు, అనుభవం, దరఖాస్తు ఫారమ్ మొదలైన వాటికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం, డెవలప్‌మెంట్ కమిషనర్ (హస్తకళలు) కార్యాలయం (www.handicrafts.nic.in) వెబ్‌సైట్ నుండి వివరాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, ఆపై 'ప్రకటన'పై క్లిక్ చేయండి. ఏదైనా సమాచారం/సహాయం కోసం, దరఖాస్తుదారు సమీపంలోని హస్తకళల సేవా కేంద్రం (హెచ్ఎస్‌సి)లో సంప్రదించవచ్చు.
3) దరఖాస్తుకు సంబంధించి పూరించి, అన్ని విధాలుగా పూర్తి చేసి, హస్తకళల ఎంట్రీలు/ అవసరమైన పత్రాలతో పాటు సమీపంలోని హస్తకళల సేవా కేంద్రంలో 12.05.2025 నాటికి సమర్పించాలి.

CBC 41103/11/0001/2526



రెండోరౌండ్‌కు సింధు, ప్రణయ్

- ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్

నింగ్బో(చైనా): ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. బుధవారం జరిగిన పోటీల్లో లక్ష్యసేన్‌తోపాటు కిదాంబి శ్రీకాంత్ తొలిరౌండ్‌లోనే ఓటమిపాలవ్వగా.. మహిళల సింగిల్స్‌లో పివి సింధు రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లింది. మూడుసెట్ల హోరాహోరీ పోరులో సింధు 18-21, 21-14, 21-19తో జె.డబ్ల్యు.గో(కజకిస్తాన్)పై చెమటోడ్చి నెగ్గింది. మరో పోటీలో మాల్విక బన్సోద్ 18-21, 19-21తో వై.జె.సిమ్(కొరియా) చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 17-21తో తొలిగేమ్‌ను చేజార్చుకున్నా.. ఆ తర్వాత రెండు గేమ్‌లను 23-21, 23-21తో చైనాకు చెందిన లూను చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరాడు. ఇతర పోటీల్లో కిదాంబి శ్రీకాంత్ 14-21, 13-21తో గింటింగ్(ఇండోనేషియా), ప్రియాన్షు రాజ్‌వత్ 9-21, 13-21తో జడ్.జె.లీ(మలేషియా) చేతిలో వరుససెట్లలో ఓడాడు. మరో పోటీలో లక్ష్యసేన్ 19-21, 15-21తో చైనా షట్లర్ షీ చేతిలో ఓడి ఇంటిదారి పట్టాడు. ఇక పురుషుల డబుల్స్‌లో కెపి గరగ-ప్రీత్ జంట 14-21, 17-21తో చైనా షట్లర్ల చేతిలో, రథినసబపతి-అంసకరువన్ జంట 15-21, 14-21తో మలేషియా జంట చేతిలో పరాజయాన్ని చవిచూశారు.

ఆశాజనకంగా అరటి ధర

- టన్ను రూ.30 వేలకు కొనుగోలు
- ఎగువ రాష్ట్రాల్లో పెరిగిన డిమాండ్
- ఉమ్మడి జిల్లా నుంచి రోజూ 200 లారీల్లో ఇతర ప్రాంతాలకు ఎగుమతి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అరటి ధర ఆశాజనకంగా ఉంది. పెళ్లిళ్ల సీజన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలు రావడంతో పాటుగా ఎగువ రాష్ట్రాల్లో దిగుబడులు లేకపోవడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఉభయ గోదావరి జిల్లాల్లో అరటి తోటలకు ఒక్కసారిగా ధరలు పెరిగాయి. టన్ను రూ.18వేల నుంచి గరిష్టంగా రూ.30వేలకు చేరింది. స్థానిక మార్కెట్లలో అరటి గెల రూ.250 నుంచి రూ.450కి చేరింది. కొన్నిసార్లు గరిష్టంగా రూ.500 చొప్పున కొనుగోలు జరుగుతోంది. గత సీజన్‌లో టన్ను రూ.18వేల వేల నుంచి గరిష్టంగా రూ.24,000కు హోల్‌సేల్‌లో వ్యాపారులు కొనుగోలు చేశారు. మూడేళ్లలో అదే అత్యధికమని రైతులు సంతోషించారు. దేశంలో అత్యధికంగా అరటి సాగు జరిగే మహారాష్ట్రతో పాటు బీహార్, ఒడిశా, హైదరాబాద్, నిజామాబాద్, ముంబయి, రాయపూర్ తదితర ప్రాంతాలలో అరటి దిగుబడులు లేకపోవడంతో రాష్ట్రంలోని అరటికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.



తూర్పు, కోనసీమ జిల్లాల్లో విస్తారంగా సాగు

కోనసీమ జిల్లాలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీపేట మండలాల్లో విస్తారంగా అరటి సాగు జరుగుతోంది. తూర్పు గోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాల్లో అరటి సాగు అధికంగా జరుగుతోంది. వీటితో ఈ రెండు జిల్లాల్లో మరో 8 మండలాల్లో అక్కడక్కడా అరటి సాగు జరుగుతోంది. అధికారుల గణాంకాల ప్రకారం రెండు జిల్లాల్లో సుమారు 45,000 ఎకరాల్లో అరటి తోటలు సాగవుతున్నాయి.

ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులు 25 వేల మంది, వ్యాపారులు మరో 3 వేల మంది అరటిపంటపై ఆధారపడి జీవిస్తున్నారు. రావులపాలెం మార్కెట్ నుంచి ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కలకత్తా తదితర రాష్ట్రాలకు ప్రతి రోజూ 100 లారీల్లో ఎగుమతి చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో సుమారు 150కి పైలా లారీలు, ఇతర వాహనాలతో అరటి ఎగుమతి చేసేవారు. రావులపాలెం, ఆత్రేయపురం అరటికి మంచి డిమాండ్ ఉంటోంది. సైజు, లావు, నాణ్యతతో పాటు రుచి, సువాసన కలిగి ఉంటాయి. ప్రధానంగా పచ్చ, కూర కర్పూరం, తెల్లచక్రకేళి, బుసావళి, ఎర్ర చక్రకేళి, తదితర రకాల అరటిని రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు సాగు ఖర్చు రూ.50 వేల నుంచి రూ.70 వేలు ఉంటుంది.

రోజూ 200 లారీల్లో ఎగుమతి

జిల్లాలోని మార్కెట్ల నుంచి రోజూ 200 లారీలు మాత్రమే ఎగుమతి జరుగుతున్నాయి. సాధారణంగా 100 నుంచి 150 లారీలలో ఎగుమతులు జరుగుతుంటాయి. జిల్లాలోని 45 వేల ఎకరాలకు గానూ సుమారు 8 లక్షల టన్నుల అరటి దిగుబడి వస్తుందని అంచనాగా తెలుస్తోంది. కొన్నేళ్లుగా అరటిసాగుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వడం లేదు. ఆకుపచ్చ తెగులు, అనంతరం వరదల ప్రభావంతో అరటి రైతు డీలాపడ్డారు. కొన్నేళ్లుగా అరటిసాగుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వడం లేదు. నిల్వ చేసుకునే సౌకర్యాలు లేక అన్‌సీజన్‌లో తక్కువ ధరలకు విక్రయించక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. తాజాగా సీజన్‌లో భారీ డిమాండ్ నెలకొనడంతో ధరలు ఆకాశాన్ని చేరాయి. ప్రస్తుత ధరలు అరటి మార్కెట్లో మరో నెలపాటు ఉండే అవకాశం వుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రతి కూల పరిస్థితుల్లోనూ రైతులను ఆదుకునేందుకు నిల్వ చేసుకునే సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని కేంద్ర మంత్రికి వినతి

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో తమ పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడుకు రైతులు వినతిపత్రం అందజేశారు. విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలించేందుకు మంగళవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా హైవేపైన ఉప్పాడపేట జంక్షన్ వద్ద రైతులు ఆయనను కలిశారు. ముఖ్యమంత్రితో మాట్లాడి సాధ్యాసాధ్యాలను పరిశీలించి రైతుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

షూటర్ సురుచికి స్వర్ణం

- ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్

బ్యూనస్‌ఎయిర్(అర్జెంటీనా): ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్‌లో భారత్‌కు మరో స్వర్ణ పతకం దక్కింది. మంగళవారం రాత్రి జరిగిన మహిళల 10మీ. ఎయిర్ పిస్టోల్ విభాగంలో 18ఏళ్ల యువ షట్లర్ సురుచి ఇందర్ సింగ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆమె 583 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. ఫైనల్‌లోనూ సురుచి అదే జోరు కొనసాగించింది. ఆరంభంలో కాస్త వెనుకబడినా.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుంది. 8మంది షూటర్ల మధ్య జరిగిన ఫైనల్లో 244.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్,10 మీటర్ల ఎయిర్ రైఫిల్ కేటగిరీలో రుద్రాంక్ష్ పాటిల్ ఇప్పటికే గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే.

ఐదో గేమ్‌లోనూ జు గెలుపు

- ఫిడే మహిళల ప్రపంచకప్ చెస్ ఛాంపియన్‌షిప్

జిన్హు(చైనా): ఫిడే మహిళల ప్రపంచకప్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో జు-వెన్‌జున్ మరో విజయాన్ని సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన ఐదో రౌండ్‌లో జు 59 ఎత్తుల్లో టాన్-జోంగీపై విజయం సాధించింది. దీంతో ఐదో గేమ్ ముగిసే సరికి జు 3-2పాయింట్ల ఆధిక్యతలో నిలిచింది. ఐదో గేమ్ ప్రారంభం నుంచి జు ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయిస్తూనే ఉంది. 30ఎత్తుల తర్వాత కొంత ఇబ్బందులు పడ్డా.. టాన్ రాజుపై దాడికి ప్రయత్నించే క్రమంలో పొరపాటు చేసి రక్షణాత్మకంగా కదలికలు చేసింది. అలాగే టాన్ తొలి ఎత్తునుంచే సాహసోపేతమైన ఎత్తులతో ప్రత్యర్థిని ఇబ్బందుల్లో పడేయాలని చూసినా జు సమర్ధవంతంగా ఆ ఎత్తులను తిప్పి కొట్టింది.

మ్యాక్స్‌వెల్‌కు జరిమానా

- 25శాతం మ్యాచ్ ఫీజులో కోత..!

ముంబయి: పంజాబ్ కింగ్స్ ఆల్ రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ జరిమానాకు గురయ్యాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఐపిఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు మాక్స్‌వెల్‌కు మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్‌ను జోడించారు. ఐపిఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2లోని లెవల్ 1 తప్పదానికి పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి మ్యాచ్ రిఫరీ తీసుకున్న నిర్ణయానికి మ్యాక్స్‌వెల్ సైతం అంగీకరించాడని, దాంతో మ్యాచ్‌ఫీజులో 25శాతం కోత విధిస్తున్నట్లు బిసిసిఐ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, మ్యాక్స్‌వెల్ చేసిన తప్పేంటో మాత్రం చెప్పలేదు. సీఎస్‌కేతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ బ్యాటింగ్‌లో విఫులమయ్యాడు. కేవలం ఒక పరుగు చేసిన పెవిలియన్‌కు చేశాడు. సీఎస్‌కే స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 18 పరుగుల తేడాతో విజయం సాధించింది.

జగన్ పర్యటనలో భద్రతా వైఫల్యం

- వైసిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ సిఎం వైఎస్ జగన్ రామగిరి పర్యటనలో కనీస భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరించిందని మాజీ చీఫ్ విప్, వైసిపి నాయకులు జి శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు హోంమంత్రి స్థాయి మరిచి మాట్లాడుతున్నారని అన్నారు. జడ్ ప్లస్ కేటగిరి భద్రత ఉన్న నాయకుడి విషయంలో హోంమంత్రి, పోలీస్ సంఘాలు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. హెలికాప్టర్ ల్యాండ్ అయ్యే ప్రాంతంలో కనీసం పది మంది పోలీసులు కూడా లేరన్నారు. కూటమి ప్రభుత్వం పోలీసులను నిర్వీర్యం చేస్తుందని చెప్పారు. అనేక మందికి పోస్టింగ్ ఇవ్వకుండా వేధిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కేంద్రానికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

వైసిపి నేతపై హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని సిరివెళ్ల మండలం గోవిందపల్లి గ్రామంలో ఈనెల 5న వైసిపి మండల కన్వీనర్ ఇందూరి ప్రతాపరెడ్డిపై జరిగిన హత్యాయత్నం ఘటన కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్‌పి ఆదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. బుధవారం పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయంలో జిల్లా ఎస్‌పి, ఆళ్లగడ్డ డిఎస్‌పి ప్రమోద్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితులను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న గోవిందపల్లి గ్రామంలో వైసిపి నాయకుడు ఇందూరు ప్రతాప్ రెడ్డి గుడికి వెళ్లి పూజ చేస్తుండగా నిందితులు గోవిందపల్లికి చెందిన గంగ దాసరి వెంకట రవిచంద్ర రెడ్డి, సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన సంధ్య పోగుల పకీరయ్యాలు వేట కొడవళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. దీంతో గాయపడిన ఇందూరి ప్రతాప్ రెడ్డిని నంద్యాల ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఇందూరి ప్రతాప్ రెడ్డి కోలుకుంటున్నారన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం : పయ్యావుల

ప్రజాశక్తి-బెళుగుప్ప

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. బుధవారం బెళుగుప్ప మండలంలో విస్తృతంగా పర్యటించారు. కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్‌తో కలిసి పలు అభివృద్ధి పనులను చేపట్టారు. మండల కేంద్రంలోని వాసవి కల్యాణ మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే పనులన్నీ పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకుని పని చేస్తున్నామని తెలిపారు. 70 రోజుల్లో హంద్రీనీవా కాలువ వెడల్పును పూర్తి చేసేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఉరవకొండ నియోజకవర్గంలోని హంద్రీనీవా కాలువకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక ప్రాజెక్టుకు రూ.3,800 కోట్లు కేటాయించిన ఘనత టిడిపి కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. వైసిపి పాలనలో హంద్రీనీవాకు సంబంధించి ఒక తట్ట మన్ను కూడా తీయలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి రాష్ట్రంలో వచ్చే ఆదాయం, పన్ను వసూలు ఆదాయం మొత్తం జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి, పాత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలు కట్టేందుకు సరిపోతోందని తెలిపారు. ఒక్క రూపాయి కూడా మిగులు లేదన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధి నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోషణ రహిత అనంతపురం, ఏడవ పౌష్టికాహార పక్షోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి చదువుతున్న కెజిబివి, మోడల్ స్కూల్ విద్యార్థినులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న పయ్యావుల కేశవ్

అభివృద్ధి పనులు ప్రారంభం

ఉరవకొండ నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాల్లో అభివృద్ధికి బాటలు వేసేలా పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం, బిపిహెచ్, సిసిరోడ్డును కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్‌తో కలిపి ప్రారంభించారు. ముందుగా గుండ్లపల్లి రోడ్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.75 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడే రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బిపిహెచ్)ను ప్రారంభించారు. బెలుగుప్ప మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలో రూ.16.71 లక్షలతో ఏర్పాటు చేసిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఆవులన్న గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయడంపై గ్రామస్తులు 'థాంక్యూ మినిస్టర్ సార్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

యువకుడు అనుమానాస్పద మృతి

- మృతదేహంతో పోలీసుస్టేషన్ ముందు బాధితుల ధర్నా

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ఓబుళదేవర చెరువు మండల పరిధిలోని ఇనగలూరు గ్రామానికి చెందిన యువకుడు బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. యువకుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుని బంధువులు, గ్రామస్తులు బుధవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్ ముందు ప్రధాన రహదారిపై మృతదేహంతో ధర్నా నిర్వహించారు. ఈఘటనకు సంబందించిన వివరాలు... గ్రామానికి చెందిన హైదర వలి కుమారుడు రహంతుల్లా(38) మండల పరిధిలోని బాబాసాహెబ్ పల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న కోళ్ల పరిశ్రమ వద్ద వెల్డింగ్ పనులకు బుధవారం వెళ్లాడు. అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. రహంతుల్లా మృతిపై మృతుని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. గ్రామస్తులతో కలసి పోలీసుస్టేషన్ ముందు మృతదేహంతో ధర్నా నిర్వహించారు. రహంతుల్లా మృతికి కారణమైన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

బీహార్‌లో పిడుగుల బీభత్సం

- 13 మంది మృతి

పాట్నా : బీహార్‌లో బుధవారం పలు జిల్లాల్లో ఈదురు గాలులు, వడగళ్ల వాన బీభత్సం సృష్టించాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పిడుగులు పడి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. బెగూసరాయ్, దర్‌బంగా జిల్లాల్లో వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది మరణించారు. మధుబనీలో ముగ్గురు చనిపోగా ఇందులో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కుమార్తె ఉన్నారు. సమస్తిపుర్‌లో పిడుగుపాటు వల్ల ఒకరు మరణించారు. ఈ ఘటనపై సంతాపం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్.. బాధిత కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసే సూచనల ప్రకారం నడచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాగా, బిహార్ ఆర్థిక సర్వే (2024-25) ప్రకారం 2023లో పిడుగుపాటు కారణంగా రాష్ట్రంలో 275 మంది ప్రాణాలు కోల్పోయారు.

నిరుపేద మహిళా కార్మికురాలికి ఐటి నోటీసు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఒక నిరుపేద మహిళా కార్మికురాలికి ఆదాయ పన్ను శాఖ నోటీసులు జారీ చేయడం సంచలనంగా మారింది. కార్మికురాలికి ఏకంగా రూ. 4 కోట్లకు పైగా ఆదాయం ఉందని అందుకు సంబంధించి రిటర్న్ దాఖలు చేయాలంటూ అధికారులు నోటీసులు జారీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని జస్రన పట్టణంలోని మురికివాడలో సబ్రా అనే వృద్ధురాలు తన భర్తతో కలిసి నివాసం ఉంటోంది. వీరిద్దరు దినసరి కూలీలుగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే.. 2020-21 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2021-22 ఏడాదికి రూ. 4.88 కోట్లకు పైగా ఆదాయంపై పన్ను కట్టాలని నోటీసులు అధికారులు జారీ చేశారు. ఆమెకు చదవడం రాకపోవడంతో నాడు ఆ నోటీసులకు స్పందించలేదు. దీంతో ఐటి అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ పన్నుపై రిటర్న్ దాఖలు చేయాలని సూచించారు. పన్ను ఎందుకు చెల్లించలేదు.. వివరణ ఇవ్వాలని లేఖలో కోరారు. పోస్టుమాన్ సాయంతో విషయం తెలుసుకున్న పేద వృద్ధ దంపతులు కంగుతిన్నారు. ఈ విషయంపై ఎవరిని సంప్రదించాలో కూడా తెలియక ఆందోళన చెందతున్నారు.

నైట్‌క్లబ్‌లో కూలిన పైకప్పు..

- డొమినిక్ రిపబ్లిక్‌లో 98 మంది మృతి

శాంటో డొమింగో : డొమినిక్ రిపబ్లిక్‌లో ఘోర ప్రమాదం జరిగింది. నైట్‌క్లబ్ పైకప్పు కూలిపోవడంతో 98 మరణించినట్లు అధికారులు తెలిపారు. మరో160 మందికి తీవ్రగాయాలయ్యాయని అన్నారు. 400 మంది అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఈ ఘటన రాజధాని శాంటో డొమింగ్‌లోని జెట్ సెట్ నైట్‌క్లబ్‌లో జరిగింది. అయితే ప్రమాద సమయంలో నైట్‌క్లబ్‌లో ఎంతమంది ఉన్నారనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. మృతుల్లో ప్రావిన్షియల్ గవర్నర్, మేజర్ లీగ్ మాజీ బేస్‌బాలర్ పిచర్ ఆక్టావియా డోటెల్‌లు ఉన్నట్లు దేశ అత్యవసర ఆపరేషన్స్ సెంటర్ డైరెక్టర్ జువాన్ మాన్యుయేల్ మెండెజ్ తెలిపారు. పిచర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారని అన్నారు.

ప్రముఖ మెరెంగ్యూ గాయకుడు రూబీ పెరెజ్ నిర్వహిస్తున్న కన్సర్ట్‌లో రాజకీయ నేతలు, అథ్లెట్లు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ప్రదర్శన జరుగుతున్న సమయంలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. ఈ సమయంలో క్లబ్‌లో 1000 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి.

నేడు భారత్‌కు తహవూర్ రాణా

న్యూఢిల్లీ : 2008 ముంబై ఉగ్రదాడుల సూత్రధారి తహవూర్ రాణాను అధికారులు ప్రత్యేక విమానంలో గురువారం భారత్‌కు తీసుకురానున్నారు. ఈ విమానం కాలిఫోర్నియా నుంచి భారత కాలమానం ప్రకారం బుధవారమే బయలుదేరింది. తహవూర్ రాణా భారత్‌కి వచ్చిన తర్వాత విచారణ కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ఆయన్ని కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంది. కాగా, 64 ఏళ్ల తహవూర్ రాణా 26/11 ముంబయి ఉగ్రదాడుల్లో కీలక సూత్రధారి. ప్రస్తుతం ఈయన లాస్ ఏంజెల్స్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు.


పనామా కాలువను స్వాధీనం చేసుకుంటాం

- అమెరికా రక్షణ కార్యదర్శి

పనామా సిటీ : పనామా కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామని అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్ పేర్కొన్నారు. పీట్ హెగ్సేత్ బువారం పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినోతో బేటీ అయ్యారు. అనంతరం పనామా కాలువను పరిశీలించారు. దశాబ్దాల అనంతరం అమెరికా రక్షణ కార్యదర్శి మొదటిసారి పనామాలో పర్యటిస్తుండటం గమనార్హం. పనామా ప్రభుత్వంతో చర్చల తర్వాత పీట్ హెగ్సేత్ మీడియాతో మాట్లాడారు. పనామా దళాలతో అమెరికా సైనిక భద్రతా సహకారాన్ని మరింతగా బలోపేతం చేస్తామని అన్నారు. పనామా కాలువను ఆయుధంగా మార్చేందుకు చైనాను అనుమతించబోమని అన్నారు. చైనా ప్రభావం నుండి తాము తిరిగి (పనామా, అమెరికా) స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 1999 తర్వాత పనామాతో తిరిగి ఒప్పందం కుదిరిందని, దీంతో పనామా కాలువపై చైనా ప్రభావం తొలగిపోతుందని చెప్పుకొచ్చారు.

లోకో పైలట్లకు విరామం కుదరదు

- భోజనం, కాలకృత్యాలకు బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదు
- తేల్చి చెప్పిన రైల్వే బోర్డు
- మండిపడుతున్న ఉద్యోగ సంఘాలు



న్యూఢిల్లీ : విధి నిర్వహణలో ఉండగా భోజనానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి కొంత విరామం ఇవ్వాలంటూ లోకో పైలట్లు చాలా కాలంగా చేస్తున్న డిమాండ్‌ను రైల్వే బోర్డు తోసిపుచ్చింది. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సులకు ఆమోదం తెలుపుతూ డ్యూటీలో ఉన్న సమయంలో విరామం ఇవ్వడం సాధ్యపడదని స్పష్టం చేసింది. మానవ తప్పిదాల కారణంగా దేశంలో అధిక సంఖ్యలో రైలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న తరుణంలో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. లోకో క్యాబిన్‌లో సిబ్బంది మాటలు, చేతలను రికార్డు చేసే వ్యవస్థ ఏర్పాటును కూడా బోర్డు సమర్థించుకుంది. ఇది గోప్యతకు భంగకరం కాదని తేల్చింది. ఏదైనా సంఘటన జరిగితే దాని తర్వాత జరిగే విశ్లేషణలో సిబ్బందికి సహాయపడేందుకు, మద్దతుగా నిలిచేందుకు ఈ వ్యవస్థ ఉపకరిస్తుందని తెలిపింది.

'ఇది సిబ్బందిపై ఎలాంటి అదనపు పనిభారం మోపదు. నిర్వహణా సామర్థ్యాన్ని పెంచేందుకు, రైళ్లు సురక్షితంగా నడిచేందుకు ఈ వ్యవస్థ ఒక సాధనం మాత్రమే' అని జోనల్ రైల్వేల జనరల్ మేనేజర్లకు పంపిన సమాచారంలో రైల్వే బోర్డు తెలియజేసింది. రైల్వే బోర్డు, రైల్వేల పరిశోధనా విభాగమైన రిసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్‌ఓ)కు చెందిన ఐదుగురు సభ్యుల క్రమశిక్షణ కమిటీ చేసిన సిఫార్సు మేరకు హై-స్పీడ్ రైళ్ల వేగాన్ని గంటకు 110 కిలోమీటర్ల నుండి 130 కిలోమీటర్లకు పెంచింది. మెము రైళ్లలో అసిస్టెంట్ లోకో పైలట్లను నియమించాలన్న సిఫార్సుకు కూడా ఆమోదం తెలిపింది.

ఆమోదయోగ్యం కాదు

కాగా రైల్వే బోర్డు నిర్ణయాన్ని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఖండించింది. ఇది వాస్తవదూరంగా ఉన్నదని, నిరాధారమైనదని విమర్శించింది. ఈ మేరకు అసోసియేషన్ సెక్రటరీ జనరల్ కేసీ జేమ్స్ రైల్వే బోర్డు ఛైర్మన్‌కు లేఖ రాశారు. రైళ్ల వేగం పెంచితే లోకో పైలట్లపై పడే పని ఒత్తిడిని అంచనా వేయడంలో కమిటీ విఫలమైందని తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు లోకో పైలట్లకు విరామాన్ని నిరాకరించడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. లోకోమోటివ్స్‌లో టాయిలెట్ సౌకర్యం లేదని గుర్తు చేశారు. అనేక సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆరేడు గంటల పాటు ఎక్కడా ఆగకుండా ప్రయాణిస్తాయని అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.బాలచంద్రన్ చెప్పారు. 'న్యూఢిల్లీ-చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు రాత్రి 11.10 గంటలకు విజయవాడ చేరుతుంది. మరునాడు ఉదయం 6.35 గంటలకు చెన్నై చేరే వరకూ అది ఎక్కడా ఆగదు. అలాంటి పరిస్థితులలో మహిళా పైలట్ల ఇబ్బంది మరింత దుర్భరంగా ఉంటుంది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను అత్యవసర పరిస్థితిలో తప్ప మధ్యలో ఏదో ఒక స్టేషన్‌లోనో లేదా వేసైడ్ స్టేషన్‌లోనే ఆపడం కుదరదు' అని ఆయన తెలిపారు.

లోకో పైలట్ మార్గమధ్యంలో ఏదో తింటేనో లేదా కాలకృత్యాలు తీర్చుకుంటేనో తప్ప అప్రమత్తంగా ఉండలేదని రామచంద్రన్ చెప్పారు. లోక్ పైలట్ల సుదీర్ఘ పని గంటలను, వారి పని పరిస్థితులను సమీక్షించాలని అనేక సిఫార్సులు ఉన్నాయని తెలిపారు. లోకో క్యాబిన్లలో సిబ్బంది మాటలు, చేతలను రికార్డు చేయడం వారి గోప్యతను భంగపరచడం తప్ప మరేమీ కాదని అన్నారు. ఇది వారిని శిక్షించడానికి ఉపయోగించే వ్యవస్థ అని రామచంద్రన్ ఆరోపించారు.

ఏదో ఒకరోజు మోడీ దేశాన్ని అమ్మేస్తారు : ఖర్గే

అహ్మదాబాద్ : ప్రధాని మోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోడీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తారని ఖర్గే ఆరోపించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం నెలకొల్పబడుతోంది. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు భూములకు అప్పగిస్తున్నారు. ఇడబ్ల్యుఎస్ (ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాలు) రిజర్వేషన్ దెబ్బతింది. వారు బలహీన వర్గాల వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదు. వారు ప్రభుత్వరంగాన్ని ఒక్కొక్కటిగా అమ్మేస్తూ.. తమ స్నేహితులకు సహాయం చేస్తున్నారు. ఇదే కొనసాగితే.. మోడీ ఏదో ఒకరోజు ఈ దేశాన్ని అమ్మేస్తారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించిన ప్రభుత్వ రంగ కర్మాగారాలను నాశనం చేస్తున్నారు. మీరు, నేను దేశం కోసం ఏం చేస్తున్నాం? భవిష్యత్ తరాలకు మనం ఏమి ఇవ్వాలనుకుంటున్నాము? కాంగ్రెస్‌ను దుర్భాలాషలాడడం తప్ప మోడీ దగ్గర వేరే సమాధానాలు లేవు అని ఆయన అన్నారు.



నేడు ఎన్నికల సంస్థలు కూడా వారి నియంత్రణలోకే వెళ్లాయి. ప్రభుత్వం ప్రతిదానిలో జోక్యం చేసుకుంటూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో.. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఇవిఎంలను వదిలి బ్యాలెట్‌పేపర్స్ వైపు మళ్లాయి. ప్రపంచంలో ఇవిఎంలు ఎక్కడా అందుబాటులో లేవు. దేశంలో 140 కోట్ల మంది ప్రజాస్వామ్యాన్ని నమ్ముతారు. ఇప్పుడో లేక తరువాతో.. ఈ దేశ యువత మనకు ఇవిఎంలు వద్దు.. బ్యాలెట్ పేపర్లు కావాలని నినదిస్తారు అని ఖర్గే అన్నారు. భారత్‌పై అమెరికా 26 శాతం పన్నులను విధించింది. ఈ విషయంపై పార్లమెంటు చర్చించనీయలేదు. ఈ విషయంపై మేము చర్చించాలని పట్టుబట్టాము. కానీ వారు చర్చకు అనుమతించలేదు. ముఖ్యమైన ప్రజా సమస్యలను చర్చించడానికి బదులుగా.. ప్రభుత్వం పార్లమెంటులో మత విభజన గురించి చర్చించింది. దీనికోసం తెల్లవారుజామున 3-4 గంటల వరకు చర్చలు నిర్వహించింది. మణిపూర్ వంటి అంశాలపై ఉదయం 4.40 గంటలకు ప్రారంభమైంది. ఆరోజు మణిపూర్ అంశంపై మేము తరువాతరోజు మాట్లాడతామని అమిత్‌షాకు చెప్పాము. దీంతో ఈ విషయంపై మమ్మల్ని చర్చకే అనుమతించలేదు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ నేతలు ఇలాంటివి చేస్తున్నారు అని ఖర్గే విమర్శించారు.

రైల్వేలైన్ ప్రాజెక్టుకు రూ.1332 కోట్లు

- కేంద్ర కేబినెట్‌కు కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు

అమరావతి : తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. డబ్లింగ్ పనులు చేపట్టేందుకు రూ.1,332 కోట్లు కేటాయించినందుకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కు రాష్ట్ర ప్రజల తరఫున చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఈ ప్రాజెక్టు తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి కోటను అనుసంధానం చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ప్రాంతాలను అనుసంధానం చేయడం ద్వారా వైద్యం, విద్యా రంగాల్లో వెల్లూరు, తిరుపతికి మరింత ప్రాధాన్యత వచ్చేందుకు అవకాశం ఉంటుంది. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థనూ మెరుగుపరుస్తుంది. ఏపీలోని సిమెంట్, స్టీల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల పురోగతిని మరింత వేగవంతం చేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో లైన్ కనెక్టివిటీలో నూతన శకానికి నాంది పలికినట్లు అవుతుంది" అని చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

పాలస్తీనియన్లకు ఆశ్రయమిస్తాం

- తాత్కాలికంగా సాయపడేందుకు ముందుకొచ్చిన ఇండోనేషియా

జకార్తా : గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న సుదీర్ఘ దాడుల కారణంగా నిర్వాసితులైన పాలస్తీనియన్లకు తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి సిద్ధంగా వున్నట్లు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబౌ సుబియాంటో బుధవారం చెప్పారు. గాయపడిన వారికి సాదరంగా ఆశ్రయం కల్పించడానికి తాము సిద్ధమని చెప్పారు. మధ్య ప్రాచ్య దేశాల్లో పర్యటనకు బయలుదేరుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వారిని ఇక్కడకు తీసుకురావడానికి విమానాలు పంపేందుకు కూడా రడీగా వున్నామన్నారు. మొదటి దశలో వెయ్యి మందిని తీసుకురావచ్చని అంచనా వేసినట్లు చెప్పారు. గాయడిన వారికి, అనాథలైన చిన్నారులకు ముందుగా ప్రాధాన్యతనివ్వనున్నట్లు తెలిపారు. వారిని అక్కడ నుండి ఎలా తరలించాలనే విషయమై పాలస్తీనా అధికారులతో, అలాగే ఆ ప్రాంతంలోని ఇతర పక్షాలతో మాట్లాడాల్సిందిగా తమ విదేశాంగ మంత్రిని ఆదేశించానని చెప్పారు. వారు పూర్తిగా కోలుకునేవరకు ఇండోనేషియాలోనే వుంటారన్నారు. వారిని సురక్షితంగా తిరిగి పంపిస్తామన్నారు.



గత నెల్లో ఇజ్రాయిల్ మిలటరీ దాడులను పునరుద్ధరించిన తర్వాత దాదాపు 4లక్షలమంది గాజావాసులు నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. కాగా ప్రపంచంలోనే అత్యధికంగా ముస్లిం జనాభా కలిగిన ఇండోనేషియా ఇజ్రాయిల్, పాలస్తీనా ఘర్షణలకు రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమని స్పష్టం చేస్తోంది.

గాజాలో 29మంది మృతి, 80మంది గల్లంతు

ఉత్తర గాజా ప్రాంతమైన షుజయె జిల్లాలో ఇజ్రాయిల్ మిలటరీ జరిపిన శక్తివంతమైన వైమానిక దాడుల్లో చిన్నారులతో సహా 29మంది పాలస్తీనియన్లు మరణించగా, 55మంది గాయపడ్డారు. మరో 80మంది గల్లంతయ్యారు. సీనియర్ హమాస్ నేతను లక్ష్యంగా చేసుకునే తాము ఈ దాడులు జరిపినట్లు ఆర్మీ ప్రకటించింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని నబ్లస్ ఏరియాలో ఇద్దరు పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకోగా, బలాటా శరణార్థ శిబిర ప్రవేశ ద్వారాన్ని దాదాపు 300కి పైగా మిలటరీ వాహనాలు చుట్టుముట్టాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇజ్రాయిల్ సైనికులు పాలస్తీనియన్ల ఇళ్ళలోకి చొరబడి దాడులు చేస్తూ, ఐదుగురిని అరెస్టు చేశారని వార్తలందాయి. బెత్లెహామ్‌కు పశ్చిమాన గల హుసాన్ గ్రామంపై దాడి చేసి డజన్ల సంఖ్యలో గ్రామస్తులను అదుపులోకి తీసుకుని సైన్యం ఇంటరాగేట్ చేస్తోంది.

అమెరికా స్వీయకృతాపరాదం

రఘురాం రాజన్ విమర్శ



డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు అమెరికా స్వీయకృతాపరాధం (సెల్ఫ్‌గోల్)గా ఉన్నాయని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ విమర్శించారు. నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతున్న వేళ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించేందుకు అనువైన సమయంలో ట్రంప్ విధానాలు సొంత ఆర్థిక వ్యవస్థనే పట్టాలు తప్పించేలా ఉన్నాయన్నారు. అమెరికాకు ఎగుమతులు చేయడంపై ఆధారపడిన వియత్నాం వంటి దేశాలు ఈ నిర్ణయాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయరన్నారు. ప్రస్తుతం అమెరికా-చైనా మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధం భారత్‌కు మంచి అవకాశాలు సృష్టిస్తుందన్నారు. టారిఫ్‌లు ఇలానే కొనసాగితే ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితులను అవకాశాలుగా భావించి భారత్ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సమయంలో భారత్ సరైన నిర్ణయాలు తీసుకొంటే లబ్ధి పొందుతుందన్నారు. తూర్పు, ఉత్తర దేశాలతో పాటు చైనా, జపాన్ వంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవాలన్నారు. చైనాతో సమన్వయంగా వ్యవహరించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

రష్యా విక్టరీ పరేడ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

మాస్కో : రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీపై రష్యా విజయం సాధించి 80ఏళ్ళు పూర్తయిన సందర్భంగా మే 9న జరిగే విక్టరీ డే పరేడ్‌కు హాజరు కావాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోడీని రష్యా ఆహ్వానించింది. ఈ మేరకు రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రి ఆండ్రీ రుదెంకో తెలిపారు. ఇప్పటికే ఆహ్వానాన్ని పంపినట్లు, పర్యటనా వివరాలు రూపొందుతున్నట్లు రుదెంకోను ఉటంకిస్తూ రష్యా వార్తా సంస్థ టాస్ తెలిపింది. ఈ పరేడ్‌కు రావాల్సిందిగా రష్యా పలు మిత్రదేశాల నేతలను ఆహ్వానించింది. దాదాపు ఐదేళ్ళ కాలంలో మొదటిసారిగా గతేడాది జులైలో ప్రధాని మోడీ రష్యాలో పర్యటించారు. 2019లో ఆర్థిక సదస్సు కోసం తూర్పు నగరమైన వ్లాదివొస్టొక్‌లో పర్యటించారు. భారత్‌లో పర్యటించాల్సిందిగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ప్రధాని మోడీ కూడా ఆహ్వానించారు. అందుకు పుతిన్ సంసిద్ధతను వ్యక్తం చేశారు. అయితే పర్యటనా తేదీలు వెల్లడి కాలేదు. మోడీ, పుతిన్‌లు ఇరువురూ తరచుగా టెలిఫోన్‌లో మాట్లాడుకుంటారు, అంతర్జాతీయ వేదికలపై ముఖాముఖి సమావేశాలు కూడా జరుపుతూ వుంటారు.

హెచ్‌ఆర్‌టిసి నుంచి ఒలెక్ట్రాకు భారీ ఆర్డర్

- 297 బస్సుల కోసం ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ విద్యుత్ వాహన తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ తాజాగా హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌టిసి) నుండి భారీ ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు వెల్లడించింది. హెచ్‌ఆర్‌టిసి నుంచి తొమ్మిది మీటర్ల పొడవైన 297 నాన్-ఎయిర్ కండిషన్డ్ (నాన్-ఎసి) బస్సుల ప్రతిష్టాత్మకమైన ఆర్డర్ పొందినట్లు ఒలెక్ట్రా బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఒలెక్ట్రా అధికారికంగా హెచ్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మురారి లాల్ నుండి లెటర్ ఆఫ్ అవార్డ్‌ను అందుకుంది. ఒక రోడ్ రవాణా సంస్థ ఇన్ని ఎలక్ట్రిక్ బస్సులను నేరుగా కొనుగోలు చేయటం దేశంలో ఇదే ప్రథమమని ఒలెక్ట్రా సిఎండి కెవి ప్రదీప్ తెలిపారు. ఇది నిజంగా తమకు గర్వకారణమన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కొండ ప్రాంతాలలో నడిపేందుకు ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ ఎలక్ట్రిక్ బస్సులు 30 మంది ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 180 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. ఈ బస్సుల మొత్తం ఆర్డర్ విలువ రూ 424 కోట్లుగా ఉంది.





శ్రీకాంత్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

శ్రీకాంత్‌కు అంతిమ వీడ్కోలు

- విప్లవ జోహార్లు అర్పించిన సిపిఎం నేతలు
- పొలిట్‌బ్యూరో సభ్యులు అరుణ్‌కుమార్ నివాళి
- పాడె మోసిన అరుణ్, పోతినేని, నున్నా, ఎంపి వద్దిరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం అఖిల భారత 24వ మహాసభకు ప్రతినిధిగా హాజరై అకస్మాత్తుగా మృతి చెందిన యర్రా శ్రీకాంత్‌కు బుధవారం అంతిమ వీడ్కోలు పలికారు. అంతిమయాత్రకు వేలాదిగా జనం, పార్టీ శ్రేణులు కదిలివచ్చారు. శ్రీకాంత్ మృతదేహంపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో శ్రీకాంత్ పాడెను అరుణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, కొద్దిసేపు ఎంపి వద్దిరాజు రవిచంద్ర కూడా మోశారు. ఖమ్మం పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని శ్రీకాంత్ గృహం నుంచి మొదలైన అంతిమయాత్ర కాల్వొడ్డులోని వైకుంఠధామానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు శ్రీకాంత్‌కు నివాళి అర్పిస్తూ పాడారు. అంతకుముందు సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన శ్రీకాంత్ స్వగృహం అక్షయ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన సంతాప సభలో నేతలు మాట్లాడారు. శ్రీకాంత్ ఔన్నత్యాన్ని చాటుతూ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని ఆర్.అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన కుటుంబం పార్టీ కోసం నిలబడిందని, ఇప్పుడు పార్టీ ఆయన కుటుంబానికి అండగా నిలబడాల్సిన అవసరముందని అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ తరపున నివాళి అర్పిస్తున్నట్టు ప్రకటించారు. సిపిఎం అంటేనే 'యర్రా' కుటుంబం.. 'యర్రా' కుటుంబం అంటేనే సిపిఎం అనేలా ఆ కుటుంబం పార్టీతో పెనవేసుకుందని కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. శ్రామికవర్గాల రాజ్యస్థాపనకు పని చేసిన నేత యర్రా శ్రీకాంత్ అని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఉద్యమ విశిష్టత ఉన్న ఖమ్మం నగరంలో యర్రా కుటుంబం వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడమే మన కర్తవ్యమని సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు.

తమిళనాడు పిసిసి మాజీ అధ్యక్షులు కుమారి అనంతన్ మృతి

- సిఎం స్టాలిన్ నివాళి

చెన్నయ్ : కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తమిళనాడు పిసిసి మాజీ అధ్యక్షులు కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) కన్నుమూశారు. ఆయన వయస్సు 92 ఏళ్లు. ప్రముఖ కాంగ్రెస్ నేతగా, గాంధేయవాదిగా, గొప్ప వక్తగా పేరు పొందిన ఆయన.. వయో సంబంధిత సమస్యలతో మంగళవారం అర్ధరాత్రి 12.15గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై ఒకరు. గాంధీజీ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకున్న ఆయన.. పార్లమెంటులో తొలిసారి తమిళంలో మాట్లాడిన నేతగా రికార్డు నెలకొల్పారు. తమిళ భాషా అభివృద్ధి కోసం విశేష కృషి చేశారు. ఒకసారి ఎంపి, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కుమారి అనంతన్ భౌతికకాయానికి ప్రముఖులు నివాళులర్పించారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, తమిళనాడు ప్రతిపక్ష నేత పళనిస్వామి, వి.శశికళ, పన్నీర్ సెల్వం, టివికె అధ్యక్షులు చీఫ్ విజయ్‌తో పాటు పలువురు సిపిఎం నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ.. కుమారి అనంతన్ మరణం తమిళ సమాజానికి పెద్ద లోటు అన్నారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

జమ్మూకాశ్మీర్ హైకోర్టు తాత్కాలిక సిజెగా సంజీవ్ కుమార్

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ కుమార్‌ను కేంద్రం నియమించింది. ఏప్రిల్ 10 నుండి అమల్లోకి రానుందని కేంద్ర న్యాయశాఖ బుధవారం తెలిపింది. ఏప్రిల్ 9న జెకె, లడఖ్ చీఫ్ జస్టిస్ తాషి రబస్తాన్ పదవీవిరమణ చేయడంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 223 కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జమ్ముకాశ్మీర్, లడఖ్ హైకోర్టులో జడ్జీగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ సంజీవ్ కుమార్‌కు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు అప్పగించింది. కాగా, ఈనెల 4న జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు కొలీజియం పంజాబ్- హర్యానా హైకోర్టు జడ్జి జస్టిస్ అరుణ్ పల్లిని జమ్ముకాశ్మీర్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను కేంద్రం ఆమోదించాల్సి వుంది.

మోహన్‌బాబు ఇంటి ముందు మనోజ్ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఇంటి బయట బైఠాయించిన మనోజ్

రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలోని సినీనటుడు మోహన్‌బాబు ఇంటి గేటు బయట ఆయన కుమారుడు మనోజ్ బైఠాయించి నిరసన తెలిపారు. తనను ఇంట్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు ఆర్డర్‌తో వచ్చినా తనను జల్‌పల్లిలోని ఇంట్లోకి పోలీసులు వెళ్లనివ్వడం లేదని తెలిపారు. తమ ఇంటికి వెళ్లకుండా నాన్న, మంచు విష్ణు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్న చెబితేనే ఇంట్లోకి వెళ్లాలని పోలీసులు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఇంట్లో తన పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయని, తాను వాటి కోసమే వచ్చానని అన్నారు. ఇది ఆస్తి వివాదం కాదని, తనకు ఆస్తి కావాలని ఎప్పుడూ అడగలేదన్నారు. ఇంటి చుట్టూ భారీగా పోలీస్ బందోబస్తు పెట్టారని, కావాలనే తనపై రౌడీషీటర్లతో విష్ణు దాడులు చేయిస్తున్నాడని ఆరోపించారు. ఏప్రిల్ 1న తన కూతురు జన్మదిన వేడుకలకు జైపూర్ వెళ్లినప్పుడు విష్ణు అనుచరులు వచ్చి తమ కార్లను తీసుకెళ్లడంతోపాటు తన సెక్యూరిటీపై దాడి చేశారని ఆరోపించారు. విష్ణు కెరీర్‌ను నిలబెట్టడానికి తనతో ఆడవేషం వేయించారని అన్నారు. స్టంట్స్, సాంగ్స్, గ్రాఫిక్స్.. ఇలా వాళ్ల కోసం గొడ్డు చాకిరీ చేశానని ఆవేదన వ్యక్తం చేశారు.

దీటుగా స్పందించిన చైనా

(మొదటిపేజీ తరువాయి)

సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు చైనా చేసిన కృషి, అనుభవాలు, సాధించిన విజయాలను జిన్‌పింగ్ తన ప్రసంగంలో వివరించారు. ప్రస్తుత పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించారు. తదుపరి దశలో పొరుగు దేశాలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యకలాపాలు, లక్ష్యాలు, కర్తవ్యాలు, ఆలోచనలు, చర్యలను వివరించారు. విభేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడంతో పాటు సరఫరా గొలుసును మెరుగుపరిచి వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయాలని పొరుగుదేశాలకు సూచించారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రధాని లీ కియాంగ్ మాట్లాడుతూ, జిన్‌పింగ్ చేసిన కీలకోపన్యాసం స్ఫూర్తిని సమగ్రంగా అమలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. పొరుగు దేశాలతో కార్యకలాపాలకు సంబంధించిన వివిధ కర్తవ్యాలను సాధ్యమైనంత త్వరగా చేపట్టాల్సి వుందన్నారు. పొరుగు దేశాలను అంతర్జాతీయ దృక్పథంలో చూడాలని సదస్సు పిలుపునిచ్చింది. చైనాను లక్ష్యంగా చేసుకుని ఆ దేశ దిగుమతులపై 104 శాతం టారిఫ్‌లను విధించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై టారిఫ్‌లను ట్రంప్ మరింత దూకుడుగా అమలు చేస్తున్న నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మొదటిసారిగా బహిరంగ ప్రసంగం చేసినట్లు స్థానిక మీడియా వ్యాఖ్యానించింది.



మీకోసం

వంటకాలు నూనె తక్కువగా పీల్చుకోవాలంటే కూర వండే నూనెలో అరచెంచా వెనిగర్ కలుపుకోవాలి.

జీవన సౌరభం

దృఢ సంకల్పం.. తరగని ఆత్మవిశ్వాసం.. బలమైన కోరిక ఉన్నచోట విజయం తప్పక వచ్చి తీరుతుంది.

JEEVANA జీవన the family

మానవా! నీబుద్ధి బహుగొప్పది



గాలిమూటగ గట్టి
గగనానికెగిరేటి
మానవా! నీ తెలివి
బహు గొప్పది!

నీటి ఆవిరి బట్టి
నినదించి పరుగెత్తు
మానవా! నీ బుద్ధి
బహు గొప్పది!

అగ్ని శక్తిని చుట్టి
అంబరానికి నడచు
మానవా! నీ శక్తి
బహు గొప్పది!

విద్యుత్తు దీపాల
వెలుగు తోరణమైన
మానవా! నీ యుక్తి
బహు గొప్పది!

తారాగణములందు
వ్యోమనౌకను విందు
మానవా! నీ ప్రతిభ
బహు గొప్పది!

యంత్రహస్తాలతో
భూగృహము నిర్మించు
మానవా! నీ ఊహ
బహు గొప్పది!

సూక్ష్మ దర్శిని తోడ
సూక్ష్మక్రిములను బట్టు
మానవా! నీ దృష్టి
బహు గొప్పది!

సూర్య కిరణపు శక్తి
ఒడిసిపట్టితివయ్య
మానవా! నీ సృష్టి
బహు గొప్పది!


సముద్ర గర్భమునందు
సంపదల్ జుర్రుకొను
మానవా! నీ చూపు
బహు గొప్పది!

విశ్వ రహస్యాలు
వెదకి జల్లెడ పట్టు
మానవా! నీ మేధ
బహు గొప్పది!

– కిలపర్తి దాలినాయుడు,
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రామభద్రపురం.


లెక్క తేల్చండి

పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.



జవాబు : 78

నేను గీసిన బొమ్మ





సిహెచ్. అంజలి
5వ తరగతి
ప్రాథమిక పాఠశాల,
నార్లాపూర్ మండలం, నిజాంపేట,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జయరాజు గానం... ప్రకృతి పరిమళం

ప్రతి పదంలో ప్రకృతిని అల్లుకుని సాగే వాణి ప్రజావాణి. ఆయన తత్వం జనతత్వం. తన కలం.. గానంతో ప్రజా సమూహాన్ని ఊపేయడమే కాదు. ఆలోచనలకు పదును పెడతారు. సకల ప్రాణులకు జన్మనిచ్చి , అన్నం పెడుతున్న భూతల్లిపై జరుగుతున్న పెట్టుబడిదారీ దాడులను తన కలంతోనూ, గళంతోనూ ప్రశ్నిస్తారు. క్యాన్సర్ కారణంగా అనారోగ్యంతో ఉన్నా, వైద్యులు తనని వద్దని వారించినా పాటలతో తన పోరాట పంథా కొనసాగిస్తున్న ప్రజాకవిరాజు జయరాజు. ఆయన మాటలు, పాటలు జలధారలు. ఇటీవల విజయవాడ ఎంబి విజ్ఞానకేంద్రంలో ఆయన ప్రకృతికావ్యాన్ని పాడి వినిపించారు.





మహబూబ్‌నగర్ పట్టణంలోని గుమ్మడూరు ప్రాంతానికి చెందిన గొడిశాల చెన్నమ్మ, కృష్ణమూర్తి దంపతుల కుమారుడు జయరాజ్. బయ్యారం మండలం గంధంపల్లి హైస్కూలులో పదోతరగతి వరకూ చదివారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సింగరేణి కార్యాలయంలో పనిచేస్తున్నారు. పేద కుటుంబం కావటంతో ఆయా తరగతుల ప్రజలు ఎదుర్కొనే కష్టాలు తెలుసు. ఆయా వెతలనే కవితలుగా చిన్నప్పటి నుంచే మార్చి కవిగా గుర్తింపు పొందారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆయన సమ సమాజం రావాలనీ, వివక్ష రూపాలు అంతం కావాలని నిరంతరం కృషి చేస్తున్నారు. సాంస్కృతిక ఉద్యమం ద్వారా భావజాలాన్ని వ్యాప్తి చేయటానికి నిరంతరం ముందుండేవారు. సింగరేణి ఉద్యమంలోనూ, అభ్యుదయ, సామాజిక ఉద్యమాల్లోనూ తనదైన శైలిలో సాహితీ సృజన చేశారు. ప్రకృతి గొప్పతనాన్ని వర్ణిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం అనేక పాటలు రాశారు. వాటిని ఆయన స్వీయ కవితాగానం చేస్తుంటారు. సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాడిన క్రమంలో లాఠీ దెబ్బలు సైతం తిన్నారు. చాలాసార్లు జైలుకు సైతం వెళ్లారు. ఆ క్రమంలో నెలరోజులు జరిగిన సమ్మె సమయంలో అనేక ప్రలోభాలు వచ్చినా నికరంగా నిలబడ్డారు. ఏకంగా ఇద్దరు సిఎంలు జోక్యం చేసుకున్నా కార్మికుల పక్షాన తన పంథా వీడలేదు.

వానమ్మ వానమ్మా... వానమ్మ....

'వానమ్మ వానమ్మ... వానమ్మ... ఒక్కసారైనా వచ్చిపోవే... వానమ్మ' అంటూ ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో రైతు, రైతుకూలీల కష్టాలను ఎలుగెత్తి చాటిన జనం పాట ఇది. నీళ్ల లేక నోళ్ల తెరచి బీడు బారిన తెలంగాణా భూములను.. నేల తల్లినే నమ్ముకున్న రైతును, రైతుపైన ఆధారపడిన రైతు కూలీలను...ఎండిపోతున్న చెరువులు, డొక్క చిక్కి పోతున్న పశువుల ఆక్రందనలను సైతం తన పాటలో వినిపించిన వాగ్గేయకారుడు. 'నీళ్ల.. నిధులు.. నియామకాలు కావాలంటూ' అనేక వందల సమావేశాల్లో తన వాణిని పల్లెల్లో బాగా వినిపించారు. జనాన్ని కదిలించారు. రోజురోజుకూ తనను కబళిస్తున్న క్యాన్సర్ వ్యాధిపై పోరాటం చేస్తూనే తన చైతన్య కార్యక్రమాలను కొనసాగించారు. ఆనాటి జనం వెతలను అప్పటి పాలకులు వినిపించడానికి దిక్కులు పిక్కటిల్లేలా సాగిన జయరాజు పాట ఎందరినో కదిలించింది..

దొరతనంపై తిరుగుబావుటా...

మానుకోట గడీల్లో బాంచెన్ దొరా అంటూ సాగుతున్న వెట్టిచాకిరీని వ్యతిరేకిస్తూ, అణచివేతను, దొరల దౌర్జన్యాన్ని జయరాజు ప్రశ్నించారు. "మిణుగురు మెరిసినా నేరమేనా తెలంగాణ పల్లెల్లో.. మీసం మొలచినా నేరమేనా' అంటూ పాటలు కట్టి పాడారు. దొరతనంతో జనం అల్లాడిపోవడం చిన్ననాడే జయరాజును కదిలించింది. కరువు తాకిడికి తండ్రి బతుకు దెరువు వెతుక్కుంటూ నాగార్జునసాగర్ పనుల కోసం కల్మలచెరువు చేరారు. అక్కడే బాల్యం, ప్రాథమిక విద్య పూర్తిచేశారు జయరాజు. కొత్తగూడెంలో ఐటిఐ ఫిట్టర్ చదివి సింగరేణిలో ఉద్యోగం పొందినా తాను మాత్రం పాటకు దూరం కాలేదు. అప్పట్లో దొరలు తమ మాట వినని వారిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి... కొందరిని తుపాకీతోనే కాల్చేయించేవారు. ఈ దురాగతాలను కళ్లారా చూసిన జయరాజు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కళాశాల రోజుల్లోనే ఉద్యమంలో పాల్గొంటున్నందుకు యాజమాన్యం డిబార్ చేయించింది. అనంతరం మణుగూరు నుంచి అదిలాబాద్ దాకా బొగ్గుగనుల్లో కార్మిక శక్తిని ఏకం చేయటానికి జయరాజు కృషిచేశారు.

కొండల్లో కోయిల పాటలు పాడాలి

వర్షాన్నే కరిగించిన అక్షరాలు అతడివి. 'వందనాలమ్మా...అమ్మా వందనాలమ్మా' అంటూ తల్లి ప్రేమను ప్రజలకు అందించి అందరి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసిన రచనా శైలి ఆయనది. ప్రకృతి లేకుండా ఆయన కవిత్వం ఉండదు. కవిత్వం, రచనా వ్యాసాగంలో ఏదో ఒక రూపంలో ప్రకృతి పచ్చదనం ఇమిడిపోయి రెపరెపలాడుతుంది.

ప్రపంచీకరణ ప్రమాదంపైనా...

ప్రపంచీకరణ ఫలితంగా ప్రపంచమే ఒక మారుమూల గ్రామంగా మారిపోయింది. వ్యాపారపంటలొచ్చి రసాయన ఎరువుల వాడకం ఎక్కువైంది. కరువులు ఏర్పడి వాగులు, చెరువులన్నీ ఎండిపోతున్నాయ్. పల్లెలన్నీ ఎడారులైనాయి అంటూ 'పచ్చని చిలుకల కంకు లేయాల్సిన జొన్నచేలు మసిబారి కాటుక కంకులేసి వెలుతుర్ని కోల్పోతాయి' అంటూ రైతుల వ్యథలను చక్కగా ఆలపించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం పరిహాసానికి గురవుతుండటం, నియంతృత్వం విరగబడి నవ్వుతుండటం, కులం, మతం, ప్రాంతం, తెగ పేరుతో జనం మధ్య అగ్ని పెట్టేస్తున్నాయంటూ హృద్యంగా ఆలపించారు. శ్రీశ్రీ, సుద్దాల అశోక్‌తేజ వంటి రచయితలు రచించిన అభ్యుదయ, దేశభక్తి, విప్లవ గీతాలను ఎంబివికెలో గానం చేసి, ప్రేక్షకులను అలరించారు..

జయరాజ్ ప్రకృతిపైన 122 కథలు, గేయాలతో రాసిన 'అవని' పుస్తకం హిందీ, ఇంగ్లీష్, కన్నడ సహా అనేక భాషల్లోకి అనువాదమై విస్తృత ప్రాచుర్యం పొందింది. ఆయన రాసిన పాటలు, కవితలు నిరంతరం ప్రజల నోళ్లలో నానుతూనే ఉన్నాయి.

కదిలే పాటల ప్రవాహం

మానవ పరిణామ క్రమం, శ్రమ పాత్ర, వివిధ చెట్ల, పక్షుల, జంతువుల పరిణామక్రమం, సంగీత సాహిత్యాలు, జానపదాల వికాసం .. మొత్తం క్రమాన్ని ఆయన గొప్ప పాటగా రాసి, ప్రాచుర్యం పొందారు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశేష కృషిచేసినందుకు గాను ఆయనకు అనేక అవార్డులు, పురస్కారాలు వరించాయి.

ఉగాది పండుగను పురస్కరించుకొని మార్చి 31న మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లోని చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో జాషువా సాంస్కృతిక వేదిక, పాపులర్ షూమార్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో 'ప్రకృతికావ్యం'పై డాక్టర్ జయరాజు స్వీయకవితాగానం చేశారు. ఫోరంఫర్ ఆర్టిస్ట్స్ తరపున అరసవిల్లి గిరిధర్ పెయింటింగ్‌ను బహూకరించారు. కవి, రచయిత అనిల్ డ్యానీ సమన్వయం చేశారు. జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు సభను ప్రారంభించారు.ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ సందేశం ఇచ్చారు.

– యడవల్లి శ్రీనివాసరావు

సాయి సుదర్శన్ అదరహో...

- రాజస్తాన్‌పై గుజరాత్ గెలుపు



అహ్మదాబాద్: ఐపిఎల్ సీజన్-18లో గుజరాత్ జెయింట్స్ బ్యాటర్ల హవా కొనసాగుతోంది. నరేంద్ర మోడీ స్టేడియంలో రాజస్తాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్(82; 53బంతుల్లో 8ఫోర్లు, 3సిక్సర్లు) అర్ధసెంచరీకి తోడు బట్లర్(36), షారుక్ ఖాన్(36) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్థాన్ జట్టు 19.2ఓవర్లలో 159పరుగులకే కుప్పకూలింది. రాజస్తాన్ బ్యాటర్ హెట్‌మైర్(52) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ సంజు(41) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. గుజరాత్ బౌలర్లు ప్రసిధ్ కృష్ణకు మూడు, రషీద్ ఖాన్, సాయి కిశోర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను ఆరంభం నుంచే కట్టడి చేయాలని రాజస్థాన్ భావించింది. మూడో ఓవర్‌లోనే తొలి వికెట్‌ను తీసింది. 2.1 ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్ వేసిన బంతికి శుభమన్ గిల్(2) బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జోస్ బట్లర్ (36)తో కలిసి సాయి సుదర్శన్ (82) చెలరేగాడు. జట్టును భారీ స్కోర్ దిశగా తీసుకెళ్లాడు. అయితే వీరిద్దరి విజృంభణకు10వ ఓవర్‌లో బ్రేక్ పడింది. ఆ ఓవర్‌లో చివరి బంతికి బట్లర్ ఎల్‌బీడబ్ల్యూ అయ్యాడు. తొలుత ఎంపైర్ దీన్ని ఔట్‌గా ప్రకటించలేదు. రాజస్థాన్ రాయల్స్ రివ్యూ కోరడంతో థర్డ్ ఎంపైర్ ఔట్‌గా నిర్ణయించింది. బట్లర్ తర్వాత క్రీజులోకి వచ్చిన షారుక్‌ఖాన్ కూడా దూకుడగా ఆడాడు. 20 బంతుల్లో 36 పరుగులు చేశాడు. కానీ తీక్షణ బౌలింగ్‌లో 15.4 బంతికి షారుక్ ఖాన్ స్టంపౌట్ అయ్యాడు. షారుక్ ఖాన్ తర్వాత వచ్చిన రూథర్‌ఫోర్డ్(7) వచ్చి రాగానే సిక్స్‌తో విరుచుకుపడ్డాడు. కానీ ఆ దూకుడు ఎక్కువసేపు కొనసాగించలేకపోయాడు. 16.1వ ఓవర్‌లో సందీప్ శర్మ బౌలింగ్‌లో వికెట్ కీపర్ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ఇక 19వ ఓవర్‌లో రెండో బంతికి సాయి సుదర్శన్ కూడా ఔటయ్యాడు. తుషార్ దేశ్‌పాండే వేసిన బంతికి శాంసన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ వెంటనే రషీద్ ఖాన్ (12) కూడా ఔటయ్యాడు. రాహుల్ తెవాటియా (24) ఫర్వాలేదనిపించాడు. ఫలితంగా నిర్ణీత 20ఓవర్లు ముగిసేసరికి ఆరు వికెట్ల నష్టానికి గుజరాత్ 217 పరుగులు చేసింది. రాజస్థాన్ బౌలర్లు తీక్షణ, దేశ్‌పాండేకు రెండేసి, ఆర్చర్, సందీప్ శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)సంజు (బి)దేశ్‌పాండే 82, శుభ్‌మన్ గిల్ (బి)జోఫ్రా ఆర్చర్ 2, జోస్ బట్లర్ (ఎల్‌బి)తీక్షణ 36, షారుక్ ఖాన్ (స్టంప్)సంజు (బి)తీక్షణ 36, రూథర్డ్‌ఫోర్డ్ (సి)సంజు (బి)సందీప్ శర్మ 7, రాహుల్ తెవాటియా (నాటౌట్) 24, రషీద్ ఖాన్ (సి)జైస్వాల్ (బి)దేశ్‌పాండే ఆర్షాద్ ఖాన్ (నాటౌట్) 0, అదనం 18 (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 217పరుగులు. **వికెట్ల పతనం:** 1/14, 2/94, 3/156, 4/163, 5/187, 6/201 **బౌలింగ్:** జోఫ్రా ఆర్చర్ 4-0-30-1, ఫారుఖీ 4-0-38-0, తుషార్ దేశ్‌పాండే 4-0-53-2, సందీప్ శర్మ 4-0-41-1, తీక్షణ 4-0-54-2.

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)రషీద్ ఖాన్ (బి)ఆర్షాద్ ఖాన్ 6, సంజు (సి)సాయి కిషోర్ (బి)ప్రసిధ్ 41, నితీశ్ రాణా (సి)కుల్వంత్ (బి)సిరాజ్ 1, రియాన్ పరాగ్ (సి)బట్లర్ 9బి)కుల్వంత్ 26, ధృవ్ జురెల్ (సి)సాయి కిషోర్ (బి)రషీద్ ఖాన్ 5, హెట్‌మైర్ (సి)సాయి కిషోర్ (బి)ప్రసిద్ 52, దూబే (ఎల్‌బి)రషీద్ ఖాన్ 1, జోఫ్రా ఆర్చర్ (సి)శుభ్‌మన్ (బి)ప్రసిద్ 4, తీక్షణ (సి)సాయి కిషోర్ (బి)సాయి కిషోర్ 5, దేశ్‌పాండే (సి)రషీద్ ఖాన్ (బి)సాయి కిషోర్ 3, సందీప్ శర్మ (నాటౌట్) 6, అదనం 9, (19.2ఓవర్లలో ఆలౌట్) 159పరుగులు. **వికెట్ల పతనం:** 1/10, 2/12, 3/60, 4/68, 5/116, 6/119, 7/144, 8/145, 8/150, 10/159 **బౌలింగ్:** సిరాజ్ 4-0-30-1, ఆర్షాద్ 2-0-19-1, ప్రసిద్ 4-0-24-3, కుల్వంత్ 3-0-29-1, రషీద్ 4-0-37-2, సాయి కిశోర్ 2.2-0-20-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	5	4	1	8	+1.41
ఢిల్లీ	3	3	0	6	+1.25
బెంగళూరు	4	3	1	6	+1.01
పంజాబ్	4	3	1	6	+0.28
లక్నో	5	3	2	6	+0.07
కోల్‌కతా	5	2	3	4	-0.05
రాజస్తాన్	5	2	3	4	-0.77
ముంబయి	5	1	4	2	-0.01
చెన్నై	5	1	4	2	-0.88
సన్‌రైజర్స్	5	1	4	2	-1.62

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు

బెంగళూరు × ఢిల్లీ క్యాపిటల్స్
వేదిక: బెంగళూరు; రాత్రి 7.30గం॥లకు

నేడు జాక్ సినిమా విడుదల



సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కిన చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' ఉపశీర్షిక. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. ప్రకాష్‌రాజ్, వీకే నరేష్ కీలక పాత్రలు పోషించారు. గురువారం ఈ సినిమా విడుదల కానుంది. దర్శకుడు భాస్కర్, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను చిత్ర యూనిట్ పెద్దఎత్తున నిర్వహించింది. సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్యతో పాటుగా చిత్ర యూనిట్ ప్రతినిధులంతా పాల్గొన్నారు.

యుపి సిఎంను కలిసిన 'కన్నప్ప' బృందం



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్‌ను కథానాయకుడు మంచు విష్ణు, ఆయన తండ్రి మోహన్‌బాబు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా బుధవారం కలిసి జ్ఞాపికను అందజేశారు. జూన్ 27న విడుదల కానున్న 'కన్నప్ప' సినిమా పోస్టర్‌ను సిఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయనకు రమేష్ గొరిజాలా వేసిన పెయింటింగ్‌ను బహుమతిగా అందజేశారు. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా మంచు విష్ణు ప్రకటించారు. పాన్ ఇండియా సినిమాగా 'కన్నప్ప'ను తెరకెక్కించామనీ, ప్రచారంలో భాగంగా ఉత్తర ప్రదేశ్‌లో పర్యటించామని పేర్కొన్నారు. మోహన్‌బాబు నిర్మిస్తూ నటిస్తున్న ఈ సినిమాలో మంచు విష్ణుతోపాటుగా ప్రభాస్, కాజల్ అగర్వాల్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్ కీలకపాత్రలు పోషించారు.

కుటుంబ కథాచిత్రంగా అలరిస్తుంది : ప్రదీప్



'నా స్నేహితులకు నాలాగే సినిమా అంటే పిచ్చి. అందరికీ మంచి ఛాన్స్‌లు వస్తున్నాయి. కానీ మేమంతా కలిసి ఓ సినిమా చేయాలని ఎప్పటి నుంచే అనుకుంటున్నాం. అది ఇప్పుడు కుదిరింది. 'అక్కడ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమాలో మంచి కథ ఉంది. అందరం కలిసి చేస్తే బాగుంటుందని అనుకొని ఈ సినిమాను స్టార్ట్ చేశాం. ఈ కథకు ఫౌండేషన్ నుంచి వర్క్ చేశాం. అందుకే కొంచెం టైం పట్టింది. ఫ్యామిలీ అంతా కూర్చుని సమ్మర్లో హ్యాపీగా చూసే సినిమా. ఫ్యామిలీ ఆడియెన్స్ మా నుంచి ఎలాంటి కంటెంట్‌ను ఆశిస్తారో అదే ఉంటుంది. థియేటర్లకు వచ్చి ఎంజాయ్ చేయొచ్చు'నని కథానాయకుడు ప్రదీప్ అన్నారు. ప్రదీప్ కథానాయకుడుగా, దీపికా పిల్లి కథానాయికగా నటించిన చిత్రం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' ఈనెల 11న విడుదల కానుంది. ఇదే టైటిల్ పవన్ కళ్యాణ్ మొదటి సినిమా కూడా కావటం విశేషం. దర్శకత్వం నితిన్ భరత్, సంగీతం రదన్.

అల్లు అర్జున్-అట్లీ సినిమాకు అభయంకర్ సంగీతం



అల్లు అర్జున్‌తో తమిళ దర్శకుడు అట్లీ కొత్త సినిమా చేయబోతున్నాడు. సైన్స్‌ఫిక్షన్ ఎంటర్‌టైనర్ కథతో ఇది తెరకెక్క నుంది. ఈమేరకు ఓ వీడియో కూడా మేకర్లు విడుదల చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ 20 ఏళ్ల యువకుడు సాయి అభయంకర్ వ్యవహరించబోతున్నారు. యూట్యూబ్ లో గతేడాది అతడు తయారుచేసిన ఆల్బమ్స్‌లో 'కచ్చి సేరా', 'ఆశా కూడా' పాటలు ఒక్కొక్కటి 200 మిలియన్ల వ్యూస్ సాధించాయి. వీటిని పాడి అందులో కనిపించిన యువకుడే ఈ సాయి అభయంకర్. గతంలో తెలుగు, తమిళ సినిమాల్లో పాటలు పాడిన సింగర్స్ టిప్పు-హరిణిల కుమారుడే సాయి. ఇతడు ప్రయివేటు ఆల్బమ్ సాంగ్స్‌తో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అట్లీ ఇతనైతేనే బాగుంటుందనేది చెప్పగా అర్జున్ కూడా అంగీకరించినట్లుగా సమాచారం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68